


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 307 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 9 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :307 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 9 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## ఇరాన్‌పై మరోసారి దాడి చేస్తాం.. ట్రంప్ సంచలన ప్రకటన



- గత రాత్రి ఇరాన్‌పై భారీ దాడులు నిర్వహించామన్న ట్రంప్
- అవసరమైతే ఈరోజు అదే తరహాలో దాడులు చేస్తామని హెచ్చరిక
- ఇరాన్ తీరుతెన్నులు మారకపోవడమే కారణమని వివరణ
- టర్కీలో నాటో సదస్సు సందర్భంగా మీడియాతో మాట్లాడిన అధ్యక్షుడు

పెన్ పవర్ డెస్క్:అమెరికా మరోసారి ఇరాన్‌పై దాడులకు సిద్ధమవుతోందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. గత రాత్రి భారీ దాడులు నిర్వహించామని తెలిపారు. అవసరమైతే మరోసారి కూడా అదే స్థాయిలో దాడులు చేస్తామని స్పష్టం చేశారు. ఇరాన్ తీరుతెన్నులు మారకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

- మిగతా 2లో



## ఏపీ విద్యార్థులకు శుభవార్త.. డైట్ ఛార్జీలు 10% పెంపు

- హాస్టళ్లు, గురుకుల విద్యార్థులకు 10 శాతం డైట్ ఛార్జీల పెంపు
- రూ.100 కోట్లతో హాస్టళ్లు, గురుకులాల మరమ్మతులు
- ప్రత్యేక కోచింగ్ కేంద్రాలు, మెరుగైన వసతులకు సీఎం ఆదేశం
- ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాలని సూచన
- పొగాకు కొనుగోళ్లు వేగవంతం చేయాలని కంపెనీలకు సీఎం ఆదేశం
- కనీస మద్దతు ధరకు తగ్గకుండా కొనుగోళ్లు జరపాలని సూచన

- మిగతా 2లో



## వైఎస్సార్ కు మరణం లేదు

- తన తండ్రి జయంతి సందర్భంగా నివాళి అర్పించిన షర్మిల
- వైఎస్ అమలు చేసిన పథకాలు ప్రతి గడపకు అందాయని ప్రశంస
- ఆయన మరణం తట్టుకోలేక 700 మంది ఆయనతో పాటే వెళ్లిపోయారని వ్యాఖ్య

- మిగతా 2లో

# ఏపీలో ఫుట్‌వేర్ హబ్‌కు అడుగులు..

## హ్యోసంగ్‌కు లోకేశ్ కీలక ప్రతిపాదనలు

- బుసాన్‌లో హ్యోసంగ్ ప్రతినిధులతో లోకేశ్ భేటీ
- కుప్పంలో ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ క్లస్టర్ ప్రతిపాదన
- ఏపీలో ఆర్‌అండ్‌డీ, ఇన్నోవేషన్ సెంటర్ కోరిన మంత్రి
- దక్షిణ భారత తయారీ క్లస్టర్‌పై ప్రత్యేక ప్రతిపాదన
- కుప్పంలో రూ.900 కోట్ల ప్లాంట్‌ను గుర్తు చేసిన హ్యోసంగ్
- ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని కంపెనీ హామీ

దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్.. ప్రముఖ హ్యోసంగ్ గ్రూప్ ఉన్నత స్థాయి ప్రతినిధులతో బుసాన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఫుట్‌వేర్ తయారీ రంగాన్ని మరింత విస్తరించేలా పలు కీలక ప్రతిపాదనలు చేశారు.కుప్పంలో హ్యోసంగ్ ఫుట్‌వేర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చినందుకు కంపెనీ ప్రతినిధులకు లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.



అదే ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ కాంపొనెంట్, మెటీరియల్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని కూడా ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో దిగుమతులపై ఆధారపడటం తగ్గడంతో పాటు ఉత్పత్తి వ్యయాలు తగ్గుతాయని వివరించారు.ప్రీమియం బ్రాండ్ల కోసం పెర్ఫార్మెన్స్ టెక్నాలజీ, ఏఐ ఆధారిత కస్టమైజేషన్, సస్టెయినబుల్ మెటీరియల్స్‌పై పరిశోధనలు జరిగే నెక్స్ట్ జనరేషన్ అథ్లెటిక్ ఫుట్‌వేర్

- మిగతా 2లో



## హిందూ మనోభావాలు ముఖ్యం కాదా?

- రావణ్‌కు వైసీపీ నేతలు మద్దతు తెలుపుతున్నారంటూ ఆనం మండిపాటు
- కోట్లాది మంది హిందువుల మనోభావాలు మీకు ముఖ్యం కాదా? అని ప్రశ్న
- ఎవరైనా సరే పరిధి దాటి మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరిక

- మిగతా 2లో



## ఆ చిరునవ్వు ఎప్పటికీ మరువలేను

### నిరంజన్ మృతిపై పవన్ కల్యాణ్ భావోద్వేగం

- అరుదైన జన్యుపరమైన వ్యాధితో పోరాడుతూ చిన్నారి నిరంజన్ మృతి
- గత నెలలోనే హనుమకొండకు వెళ్లి నిరంజన్‌ను పరామర్శించిన పవన్
- చిన్నారి మనల్ని విడిచి వెళ్లడం జీర్ణించుకోలేకపోతున్నానని ఆవేదన

పెన్ పవర్ డెస్క్:జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వీరాభిమాని, తెలంగాణలోని హనుమకొండకు చెందిన పొనుగంటి నిరంజన్ (17) అరుదైన జన్యుపరమైన వ్యాధితో పోరాడుతూ నిన్న రాత్రి కన్నుమూశాడు. ఈ వార్త తెలియగానే పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. సోషల్ మీడియా వేదికగా

- మిగతా 2లో

## నాన్నా.. మీరే నా స్ఫూర్తి

- తన తండ్రి జయంతి సందర్భంగా నివాళి అర్పించిన జగన్
- తన తండ్రి ఆశీస్సులే తన ధైర్యం అంటూ ట్వీట్
- మిస్ యూ నాన్నా అంటూ భావోద్వేగం



పెన్ పవర్ డెస్క్:దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద వైసీపీ అధినేత జగన్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. “మీరే నా స్ఫూర్తి.. మీ ఆశీస్సులే నా ధైర్యం.. మిస్ యూ నాన్నా” అంటూ జగన్ భావోద్వేగంతో కూడిన ట్వీట్ చేశారు. వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోలను పంచుకున్నారు.

- మిగతా 2లో

## మమతా బెనర్జీ పార్టీకి ఈడీ షాక్: రూ.440 కోట్ల నిధులు ఫ్రీజ్

- పార్టీకి చెందిన మూడు బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు ఫ్రీజ్
- కేర్‌వెల్ ఏవియేషన్ గ్రూప్‌తో లావాదేవీలపై దర్యాప్తు
- పార్టీ నిధులతో విమానం, హెలికాప్టర్ కొని లీజుకు తీసుకున్నట్లు ఆరోపణలు



పెన్ పవర్ డెస్క్:పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఆ పార్టీకి చెందిన మూడు బ్యాంకు ఖాతాలను ఈడీ అధికారులు స్తంభింపజేశారు. ఈ ఖాతాల్లో సుమారు రూ.440.42 కోట్ల నిధులు ఉన్నట్లు బుధవారం అధికారులు వెల్లడించారు. ఏవియేషన్ రంగానికి చెందిన 'కేర్‌వెల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్'కు సంబంధించి జరుగుతున్న అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలపై ఈడీ సుదీర్ఘ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్,

- మిగతా 2లో

## ఇథనాల్‌తో నాకు రూపాయి లాభం లేదు..

### గడ్కరీ ఘాటు కౌంటర్

- ఇథనాల్‌తో తనకు లాభం లేదన్న గడ్కరీ
- ఇథనాల్ ఉత్పత్తిలో తమ కంపెనీ వాటా కేవలం 0.07 శాతమేనని వెల్లడి
- ఆరోపణలను పూర్తిగా ఖండించిన కేంద్ర మంత్రి
- వాహనాలు దెబ్బతిన్నాయని ఆధారాలు చూపాలని సవాల్
- ఫిర్యాదులు వస్తే విచారణ చేస్తామని హామీ
- తనపై కుట్ర జరుగుతోందని ఆరోపణ



పెన్ పవర్ డెస్క్:ఇథనాల్ ఇంధన విధానంపై వస్తున్న విమర్శలను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తిప్పికొట్టారు. ఈ విధానం వల్ల తనకు ఎలాంటి వ్యక్తిగత లాభం లేదని స్పష్టం చేశారు. ఇథనాల్ కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయనే ఆరోపణలకు ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు.

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# జగన్ ధీమా ఏంటి? వచ్చే ఎన్నికల్లో గెలుద్దామంటే?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మరోసారి కోటరీ గుప్పిట్లో చిక్కుకుంటున్నారు. ఆయన కూడా మాట మార్చడంలోనూ, మడమ తిప్పడంలోనూ ఆరితేరినట్లు కనిపిస్తుంది. తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి బాటలో నడుస్తున్నానని చెప్పినప్పటికీ ఆచరణలో అది కనిపించడం లేదు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ రాజధాని విషయంలో వరసగా మాట మారుస్తున్న జగన్ కు విశ్వసనీయత లేదన్న అధికార పార్టీ నేతల విమర్శలను ఎవరైనా అంగీకరించాల్సిందే. 2014 ఎన్నికల్లో ఓటమి పాలయిన తర్వాత ప్రతిపక్ష నేతగా జగన్ రాజధాని అమరావతిని నాడు సమర్థించారు. అసెంబ్లీ వేదికగానే అమరావతిలో రాజధాని నిర్మాణానికి తన అంగీకారాన్ని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో విడిపోయిన రాష్ట్రానికి ఒక మంచి రాజధాని అవసరమని కూడా జగన్ అన్నారు.

**అధికారంలోకి రాగానే...**

కానీ 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన సులువుగా మాట మార్చారు. కేవలం అమరావతిలోనే అభివృద్ధి జరిపితే మిగిలిన ప్రాంతాలు అన్యాయమైపోతాయని, అందువల్ల మూడు రాజధానుల ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. అమరావతి, విశాఖపట్నం, కర్నూలు ను మూడు రాజధానులుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అమరావతిలో శాసన రాజధాని, కర్నూలులో న్యాయ రాజధాని, విశాఖపట్నంలో పరిపాలన రాజధాని ఏర్పాటు చేస్తామని చెప్పి అదే నినాదంతో 2024 ఎన్నికలకు జగన్ వెళ్లి బోల్తా పడ్డారు. 2024 ఎన్నికలలో పదకొండు స్థానాలు దక్కి ప్రతిపక్ష హోదా కూడా అధికారికంగా దక్కించుకోలేకపోయారు. అంటే మూడు రాజధానుల ప్రతిపాదనను నాడు మూడు ప్రాంతాల ప్రజలు సమర్థించలేదన్న విషయాన్ని అర్థమయిన జగన్ మళ్లీ మాట మార్చారు.

**అమరావతికి వ్యతిరేకం కాదంటూనే...**

ఇప్పుడు అమరావతి కు వైసీపీ వ్యతిరేకం కాదంటూనే వైఎస్ జగన్ అమరావతి పేరుతో చంద్రబాబు చేస్తున్న దోపిడీ కు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు మాత్రమే వ్యతిరేకం అని పేర్కొన్నారు. ఇప్పటికే సంపద సృష్టిస్తున్న నగరాలు మావిగన్ పేరును తెరపైకి తెచ్చారు. అమరావతి ఎప్పటికీ సంపద సృష్టించలేదని, వంద సంవత్సరాలు దాటిన కష్టమేనని చెప్పుకొచ్చారు. మావిగన్ అనేది 60 లక్షలు జనాభా ఉన్న ప్రాంతమని, అమరావతిలో కేవలం 29 గ్రామాల ప్రజలు మాత్రమే ఉన్నారని కొత్త నినాదం అందుకున్నారు. 9,536 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం మావిగన్ ఉంటుందని, అమరావతి కేవలం 217 చదరపు కిలోమీటర్లు మాత్రమేనని అన్నారు.అమరావతి రియల్ ఎస్టేట్ వెంచర్ మాత్రమేనని, మౌలిక సదుపాయాలు అన్నీ కలిగినది మావిగన్ అంటూ కొత్త నిర్వచనం చెప్పారు. ఇది వినేవారికి మరో రాజకీయ అంశంగానే చూస్తారు. ఎందుకంటే అమరావతిలో ఇప్పటికే యాభై వేల కోట్ల రూపాయలతోపనులు ప్రారంభమయ్యాయి. మళ్లీ మావిగన్ ప్రతిపాదనతో ఎన్నికలకు వెళితే జగన్ అధికారంలోకి రాగలరా? అనే సందేహం వైసీపీ నేతల్లోనే వ్యక్తమవతుంది.

# ఏపీలో ఫుట్‌వేర్ హబ్‌కు అడుగులు.. హ్వాసంగ్‌కు లోకేశ్ కీలక ప్రతిపాదనలు

- మొదటి పేజి తరువాయి

ఆర్అండ్‌డీ, ఆసియా-పసిఫిక్ ఇన్నోవేషన్ సెంటర్‌ను కూడా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుకు సేవలందించేలా సమగ్ర దక్షిణ భారత తయారీ క్లస్టర్‌ను అభివృద్ధి చేయాలని లోకేశ్ ప్రతిపాదించారు. ఇందులో కుప్పంలో ప్రధాన కార్యాలయం, తిరుపతిలో విడిభాగాల తయారీ కేంద్రం, విశాఖపట్నంలో డిజైన్, కార్పొరేట్, లాజిస్టిక్స్ విభాగాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే హ్వాసంగ్ ఫుట్‌వేర్‌కు చెందిన టైర్-1, టైర్-2 విక్రేతలతో ఏపీలో సప్లయర్ సమావేశం నిర్వహించాలని కోరారు.

సమావేశంలో హ్వాసంగ్ కార్పొరేషన్ బిజినెస్ సీఈవో హెయో సియోంగ్-రియోంగ్ స్పందించారు. కుప్పంలో రూ.900 కోట్ల పెట్టుబడితో గ్రీన్‌ఫీల్డ్ నాన్-లెదర్ ఫుట్‌వేర్ ప్లాంట్‌ను ఇప్పటికే ప్రకటించినట్లు తెలిపారు. అడిడాస్‌తో పాటు పలు అంతర్జాతీయ బ్రాండ్లకు ఓఈఎం సరఫరాదారుగా ఉన్న ఈ ప్లాంట్‌లో ఏడాదికి 2 కోట్ల జతల స్పోర్ట్స్ షూలను తయారు చేయనున్నట్లు చెప్పారు.

మొదట ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకుని ఉత్పత్తి ప్రారంభిస్తామని, తర్వాత దేశీయ మార్కెట్‌కు కూడా విస్తరిస్తామని వెల్లడించారు. పుణే, చెన్నై, అనంతపురం జిల్లా గూడపల్లిలో ఆటో విడిభాగాల తయారీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని స్పష్టం చేశారు.

# వైఎస్సార్ కు మరణం లేదు

తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 'వైఎస్సార్ లెజెండరీ లీడర్. ఆయనకు మరణం లేదు' అని షర్మిల అన్నారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా కేవలం 5 ఏళ్లు మాత్రమే పని చేసినా... ఆయన చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలు రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి గడపకు అందాయని ప్రశంసించారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, జలయజ్ఞం వంటి పథకాలను వైఎస్సార్ మనసు పెట్టి అమలు చేశారని తెలిపారు. ఆయన మరణాన్ని తట్టుకోలేక ఆ సమయంలో 700 మంది ఆయన వెంటే వెళ్లిపోయారని అన్నారు.

# హిందూ మనోభావాలు ముఖ్యం కాదా?

హిందూ దేవతలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ రావణ్‌కు వైసీపీ నాయకులు మద్దతు తెలుపుతున్నారంటూ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి సచివాలయంలో మాట్లాడిన ఆయన, "కోట్లాది మంది హిందువుల మనోభావాలు మీకు ముఖ్యం కాదా? మత విద్వేషాలు రెచ్చగొడుతూ, హిందూమతాన్ని అవమానించిన రావణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవద్దా?" అని వైసీపీ నేతలను నిలదీశారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం హిందూ మతాన్ని తక్కువ చేసి మాట్లాడటం, సమాజంలో విచ్ఛిన్నానికి ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించి విద్వేషాలు రెచ్చగొట్టడానికి రావణ్‌కు గానీ, మాజీ సీఎం జగన్ కు గానీ ఎవరు అధికారమిచ్చారని ఆనం ప్రశ్నించారు. ఎవరైనా సరే పరిధి దాటి మాట్లాడితే ఊరుకునేది లేదని.. నోటికొచ్చినట్లు వాగితే కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని మంత్రి హెచ్చరించారు.

# ఏపీ విద్యార్థులకు శుభవార్త.. డైట్ ఛార్జీలు 10% పెంపు

ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారికి అందించే డైట్ ఛార్జీలను 10 శాతం పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ పెంపును వచ్చే ఏడాది నుంచి అమలు చేయాలన్న ఆర్థిక శాఖ సూచనను సీఎం తిరస్కరించారు. ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే పెంపు అమల్లోకి రావాలని స్పష్టం చేశారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు మెరుగైన పౌష్టికాహారం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్య ద్వారానే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల జీవితాల్లో మార్పు వస్తుందని, అందుకే వారికి అన్ని విధాలా మెరుగైన అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

సంక్షేమ శాఖల సమీక్షలో ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. హాస్టళ్ల స్థానంలో మరిన్ని గురుకులాలు నిర్మించాలని, హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల మరమ్మత్తులకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసే ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రతిభావంతులైన ఇంటర్ విద్యార్థులకు పైలట్ ప్రాజెక్టు కింద ప్రత్యేక కోచింగ్ కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే సంక్షేమ విద్యాసంస్థల పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణకు ప్రత్యేక వైద్య విభాగం ఏర్పాటు చేయాలని సూచించారు.పొగాకు కొనుగోళ్లపై కూడా సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కిలోకు రూ.200 కనీస మద్దతు ధరకు తగ్గకుండా కొనుగోళ్లు జరపాలని

కంపెనీలను ఆదేశించారు. ఇండెంట్ ఇచ్చి కొనుగోళ్లు చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టొద్దని హెచ్చరించారు. టొబాకో బోర్డు పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, రైతుల నమ్మకాన్ని దెబ్బతీసే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అయితే అవసరానికి మించి పొగాకు సాగు కావడం, ఎగుమతులు తగ్గడం వల్లే ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని అధికారులు, కంపెనీల ప్రతినిధులు సీఎంకు వివరించారు.

## మమతా బెనర్జీ పార్టీకి ఈడీ షాక్: రూ.440 కోట్ల నిధులు ఫ్రీజ్

కోల్‌కతా పరిసర ప్రాంతాల్లోని ఐదు చోట్లో సోదాలు నిర్వహించిన అనంతరం ఈడీ ఈ నిర్ణయం తీసుకుంది.

ఈడీ ప్రాథమిక దర్యాప్తు వివరాలు ప్రకారం, ఏప్రిల్ 2023 నుంచి జూన్ 2026 మధ్య కాలంలో టీఎంసీకి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతాల నుంచి సుమారు రూ.160 కోట్లను కేర్‌వెల్ ఏవియేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దాని అనుబంధ సంస్థలకు బదిలీ చేశారు. ఆ తర్వాత రూ.82.96 కోట్లను మరో కంపెనీకి మళ్లించినట్లు అధికారులు గుర్తించారు. ఈ నిధులతో రూ.112 కోట్ల వ్యయంతో ఒక ఎంబ్రేయర్ లీగసీ 600 విమానం, ఒక అగస్టా 109 ఎస్పీ హెలికాప్టర్‌ను కొనుగోలు చేసినట్లు తేలింది. వీటిని తిరిగి అధిక ధరకు టీఎంసీకే లీజుకు ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

ఈ లావాదేవీల తీరు అత్యంత అనుమానాస్పదంగా ఉందని, అసలు లబ్ధిదారులను గుర్తించకుండా నిధుల మళ్లింపును దాచిపెట్టేందుకే ఈ వ్యూహాన్ని అనుసరించినట్లు అధికారులు భావిస్తున్నారు. హెలికాప్టర్ కొనుగోలుకు విదేశీ నిధులు ఏమైనా వినియోగించారా అనే కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది. ఇటీవల ఎన్నికల్లో ఎదురైన పరాజయాలతో అంతర్గత సవాళ్లను ఎదుర్కొంటున్న టీఎంసీకి, ఈ తాజా పరిణామం మరింత ఇబ్బందికరంగా మారింది. ఈ నిధుల మూలాలపై ఆ పార్టీకి చెందిన రెబల్ ఎమ్మెల్యేలు గతంలోనే పశ్చిమ బెంగాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

# నాన్నా.. మీరే నా స్ఫూర్తి

- మొదటి పేజి తరువాయి

ఇడుపులపాయలో నిర్వహించిన వేడుకల్లో వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతితో పాటు పలువురు వైసీపీ సీనియర్ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిరుపేదల సంక్షేమం, ఉచిత విద్య, వైద్యం, ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా వైఎస్సార్ చేసిన సేవలను ఈ సందర్భంగా నేతలు కొనియాడారు. ప్రజల హృదయాల్లో నిలిచిన నేతగా రాజన్న ఎప్పటికీ స్ఫూర్తిదాయకుడని వారు స్మరించుకున్నారు.

## ఇథనాల్‌తో నాకు రూపాయి లాభం లేదు..

- మొదటి పేజి తరువాయి

'ఇండియా టుడే'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన గడ్కరీ.. తమ కుటుంబానికి చెందిన చక్కెర పరిశ్రమ ఇథనాల్ విధానం కంటే ముందే ఉందన్నారు. దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో తన వాటా కేవలం 0.07 శాతం మాత్రమేనని చెప్పారు. ఇంత చిన్న వాటాతో తనకు ఆర్థికంగా పెద్ద ప్రయోజనం చేకూరే అవకాశం లేదన్నారు. ఇథనాల్ విధానాన్ని తన ప్రయోజనాల కోసం రూపొందించారనే ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని గడ్కరీ అన్నారు. దేశ ఇథనాల్ విధానాన్ని ఒక్క వ్యక్తి నిర్ణయించలేదని చెప్పారు. ప్రస్తుతం దేశంలో సుమారు 550 యూనిట్ల ద్వారా ఏడాదికి దాదాపు 1,500 కోట్ల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి జరుగుతోందని వివరించారు. ఇథనాల్ మిశ్రమ విధానాన్ని తాను ఒక్కడే రూపొందించలేదని గడ్కరీ స్పష్టం చేశారు. పెట్రోలియం శాఖ, కేంద్ర మంత్రివర్గం, శాస్త్రీయ పరిశోధనల ఆధారంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తాను ఇథనాల్ గురించే కాకుండా ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని ఎప్పటి నుంచో ప్రోత్సహిస్తున్నానన్నారు. దీని వల్ల ముడి చమురు దిగుమతులు తగ్గడమే కాక రైతులకు కూడా ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. ఇథనాల్ మిశ్రమ ఇంధనం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయని ఆరోపిస్తున్న వారిని గడ్కరీ ప్రశ్నించారు. నిజంగా అలాంటి ఘటన జరిగితే డీలర్‌తో పాటు తన శాఖకు కూడా ఫిర్యాదు చేయాలని సూచించారు. విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇథనాల్ వల్ల వాహనం దెబ్బతిన్న ఇద్దరు వ్యక్తుల పేర్లు చెప్పగలరా అని కూడా ప్రశ్నించారు. మారుతీ సుజుకీ, టయోటా, టాటా మోటార్స్, మహీంద్రా వంటి సంస్థల నుంచి ఇథనాల్ కారణంగా వాహనాలు దెబ్బతిన్నట్లు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని గడ్కరీ చెప్పారు. ఇటీవల టయోటా వాహనానికి సంబంధించిన ఘటనలో కూడా నీరు కలవడమే సమస్యకు కారణమని విచారణలో తేలిందన్నారు. కొత్త ఇంధన విధానానికి అనుమతి ఇచ్చే ముందు వాహనాలపై ఏళ్ల తరబడి పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. తనపై బురదజల్లేందుకు, ఇథనాల్ విధానాన్ని అప్రతిష్ఠపాలు చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని గడ్కరీ ఆరోపించారు. అమెరికా, బ్రెజిల్, జపాన్, జర్మనీ, థాయ్‌లాండ్, స్వీడన్ వంటి దేశాల్లో కూడా ఇథనాల్ వినియోగం కొనసాగుతోందని చెప్పారు. భారత్ అనుసరిస్తున్న విధానం కొత్త ప్రయోగం కాదని, ప్రపంచవ్యాప్తంగా అమల్లో ఉన్న విధానమేనని స్పష్టం చేశారు.

## ఇరాన్‌పై మరోసారి దాడి చేస్తాం..

- మొదటి పేజి తరువాయి

టర్కీలోని అంకారాలో నాటో సదస్సు సందర్భంగా మీడియాతో మాట్లాడిన ట్రంప్.. ఇరాన్‌పై మరోసారి సైనిక చర్య చేపట్టే అవకాశాన్ని ప్రస్తావించారు. గత రాత్రి తీవ్ర స్థాయిలో దాడులు నిర్వహించామని, అవసరమైతే ఈ రాత్రి కూడా అదే తరహా దాడులు చేస్తామని చెప్పారు. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు కొనసాగుతుండటమే దీనికి కారణమని ఆరోపించారు.ఇరాన్ అమెరికా సైనిక స్థావరాలపై దాడులు చేసిన తర్వాత కాల్పుల విరమణ కొనసాగబోదని ట్రంప్ వ్యాఖ్యానించారు. తన దృష్టిలో చర్చలు జరపడం వృథా అని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ చర్చలు కొనసాగించేందుకు అమెరికా సిద్ధంగా ఉంటుందని తెలిపారు. అయితే వాటి ఫలితాలపై మాత్రం సందేహం వ్యక్తం చేశారు.తాజా పరిణామాలతో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధం ముదిరుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ ముడి చమురు ధరలు ఐదు శాతానికి పైగా పెరిగాయి. స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి.

## ఆ చిరునవ్వు ఎప్పటికీ మరువలేను

- మొదటి పేజి తరువాయి

నిరంజన్‌ను గుర్తుచేసుకుంటూ తీవ్ర భావోద్వేగాన్ని ఆయన వ్యక్తం చేశారు.

"నిరంజన్ ఇక లేడనే వార్త నా హృదయాన్ని తీవ్రంగా కలచివేసింది. కొద్దిరోజుల క్రితమే హనుమకొండలో వాళ్ల ఇంటికి వెళ్లి కలిసిన క్షణాలు ఇంకా నా కళ్లముందే కదలాడుతున్నాయి. అంతటి భయంకరమైన అనారోగ్యంతో పోరాడుతూ కూడా నన్ను చూడగానే ఆ చిన్నారి ముఖంలో విరిసిన చిరునవ్వు ఎప్పటికీ మరువలేని జ్ఞాపకం. శరీరం వ్యాధితో క్షీణిస్తున్నా... మనసు నిండా కొండంత ధైర్యం, ఆత్మవిశ్వాసం ఉన్నాయి. అంతటి ధైర్యశాలి ఇంత త్వరగా మనల్ని విడిచి వెళ్లిపోవడం జీర్ణించుకోలేకపోతున్నా. ఆ చిన్నారి చూపిన ప్రేమ నా గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోతుంది" అంటూ పవన్ భావోద్వేగానికి గురయ్యారు.

గత నెలలోనే నిరంజన్ అనారోగ్యం గురించి తెలుసుకున్న పవన్ కల్యాణ్ స్వయంగా హనుమకొండ వెళ్లి అతడిని పరామర్శించారు. ఆ సమయంలో నిరంజన్‌ను గుండెలకు హత్తుకుని, తిరుమల ప్రసాదం ఇచ్చి, సెల్ఫీ కూడా దిగారు. తనకు ఒక కుక్కపిల్ల కావాలని అడగ్గానే... ఆ రోజే కుక్కపిల్లను పంపించారు. అంతేకాదు, "నేను 'ఓజీ 2' తీస్తే అందులో నువ్వే నా స్పెషల్ గెస్ట్.. ఇద్దరం కలిసి సినిమా చూద్దాం" అని పవన్ మాట ఇచ్చారు. కానీ, ఈ లోపే చిన్నారి అనంతలోకాలకు వెళ్లిపోవడంతో ఫ్యాన్స్ ఆవేదనకు గురవుతున్నారు. మరోవైపు, బాలీవుడ్ రియల్ హీరో సోనూ సూద్ సైతం నిరంజన్ కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి పరామర్శించారు. ఆ కుటుంబానికి తానున్నానంటూ కొండంత ధైర్యాన్ని అందించారు.

# వనుగుమ్మలో మలేరియ పిచికారి కార్యక్రమం



లూరు పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ శ్యాంప్రసాద్.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 08.** మండలంలో గల వనుగుమ్మ పంచాయితీ, వనుగుమ్మ గ్రామంలో రెండవ విడత మలేరియా స్ప్రేయింగ్ కార్యక్రమం నిర్వహించినట్లు లబ్బూరు పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఎపిడమిక్ సీజన్ నేపథ్యంలో అంటు వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దోమల వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని అన్నారు. కలుషితమైన నీరు, ఆహారం వల్ల టైఫాయిడ్, కలార, డయోరియా వంటి వ్యాధులు ప్రబల్లే అవకాశం ఉందని, అనారోగ్యం వస్తే వెంటనే ఆసుపత్రికి రావాలని సూచించారు. కాచి వడపోసిన నీటిని మాత్రమే త్రాగాలన్నారు. దోమతెరలు తప్పక వాడాలని ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రజలను సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సీతారామరాజు, రాజారావు, మలేరియా పిచ్చికారి సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు,

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలి





- ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి
- సంక్షేమ శాఖల అధికారులకు కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాలు

**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూలై 08:** సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన వసతులు కల్పించడంతో పాటు,వారిని ఉన్నత లక్ష్యాలను సాధించే ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు.

బుధవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వసతి గృహాల్లో సురక్షిత తాగునీరు, ఆర్వో ప్లాంట్ల నిర్వహణ, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, దోమతెరలు, అవసరమైన ఫర్నిచర్, విద్యుత్, పరిశుభ్రమైన వాతావరణం వంటి అన్ని మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని ఆదేశించారు. హాస్టల్ భవనాల మరమ్మతులు, నిర్మాణ దశలో ఉన్న భవనాల పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. అవకాశం ఉన్న చోట్ల విద్యార్థుల సౌకర్యార్థం సోలార్ వాటర్ హీటర్లను ఏర్పాటు చేయాలని తెలిపారు.

మధురవాడ, భీమిలిలో నిర్మాణంలో ఉన్న వసతి గృహాలను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని, అవసరమైతే కొత్త వసతి గృహాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఐఐటీ, జేఈఈ, నీట్ తదితర పోటీ పరీక్షలకు ప్రత్యేక ఇంటెన్సివ్ కోచింగ్ కొనసాగించాలని, సూపర్--60, సూపర్--30 వంటి నమూనాలతో ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ఉన్నత స్థాయికి తీర్చిదిద్దాలని నిర్దేశించారు.

హాస్టల్ విద్యార్థులకు బోధించే విద్యా వాలంటీర్ల సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించాలని, స్టడీ సర్కిళ్లను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, క్రీడలు, ఇతర జీవన నైపుణ్యాల అభివృద్ధికి కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. క్రీడా మైదానాలు ఉన్న వసతి గృహాలకు అవసరమైన క్రీడా పరికరాలు అందుబాటులో ఉంచి విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు ప్రజలకు మరింత స్పష్టంగా కనిపించేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు ప్రతి నెలా వసతి గృహాలను సందర్శించి పరిస్థితులను సమీక్షించాలని ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు, సమర్థవంతమైన నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డిడి కె. రామారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ, బీసీ వెల్ఫేర్ అధికారిని రాజేశ్వరి, బీసీ కార్పొరేషన్ ఈడీ శంకరరావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిని రామలక్ష్మి,విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కవిత, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సురేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా కురుపాం ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు.



**గుమ్మలక్ష్మీపురం జూలై 08 పెన్ పవర్.** కురుపాం నియోజకవర్గం ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి జన్మదినోత్సవ వేడుకలు బుధవారం నాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అత్యంత ఘనంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే

కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ప్రారంభించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజాప్రతినిధులు,కూటమి నాయకులు,పార్టీ కార్యకర్తలు,అభిమానులు,అధికారులు,శ్రేయోభిలాషులు ఎమ్మెల్యే ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ప్రజలు తనపై చూపుతున్న అభిమానానికి,ఆశీస్సులకు ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా మరింత అంకితభావంతో పనిచేస్తూ నియోజకవర్గ అభివృద్ధి,ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు,పార్టీ కార్యకర్తలు, అభిమానులు,అధికారులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# సర్ కార్యక్రమం గడువులోగా పూర్తి చెయ్యాలి - ఐటిడిఏ పిఓ

ముంచంగిపుట్టు మండలంలో ఐటిడిఎ సుడిగాలి పర్యటన.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 08.** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ కార్యక్రమాన్ని గడువులోగా పూర్తి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ స్పష్టం చేశారు. బుధవారం ముంచంగిపుట్టు మండలంలో సుడిగాలి పర్యటన చేసిన ఆయన ప్రస్తుతం జరుగుతున్న సర్ కార్యక్రమాలను పరిశీలించారు. మండలంలోనీ జోలపుట్టు, మాకవరం, దొడిపుట్టు, సంగడ, తలబిరడా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి పరిశీలించారు. సచివాలయ సిబ్బంది, బిఎల్ వో లతో కలిసి ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై అరా తీశారు. సర్ ప్రక్రియ వేగవంతం చేయాలని, ఎట్టువంటి సమస్య తలెత్తిన తమ దృష్టికి తీసుకురావాలని ప్రాజెక్ట్ అధికారి సూచించారు. అనంతరం పనసపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను తనిఖీ చేసి సమస్యలపై విద్యార్థినిలతో అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ అధికారి వెంట పర్యటించిన వారిలో మండల అభివృద్ధి అధికారి కే ధర్మారావు, తహసిల్దార్ త్రినాధ నాయుడు, మండల విద్యాశాఖ అధికారి కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.



# కార్డెన్ సెర్చ్ నిర్వహించిన ఎక్సైజ్ సిబ్బంది.

**కురుపాం జులై 08 పెన్ పవర్.** నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కురుపాం సర్కిల్ పరిధిలో గల చినమేరంగి మరియు గవరంపేట గ్రామంలో బుధవారం నాడు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్డెంట్ పార్వతీపురం,ఏ సంతోష్, ఆధ్వర్యంలో కార్డాన్ సెర్చ్ నిర్వహించి నిర్వహించామని కురుపాం రోహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్,పి శ్రీనివాసరావు పత్రిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ,చిన్న మేరంగి,గౌరంపేట గ్రామాలలో ప్రజలకు ముఖ్యంగా యువతకు నాటు సారా వలన కలిగే అనర్థాలు గూర్చి తెలియజేస్తూ,

నాటుసారా వ్యాపారానికి దూరంగా ఉండాలని ఎస్సై పిలుపునిచ్చారు. తదుపరి గవరంపేట గ్రామంలో కార్డాన్ సెర్చ్ నిర్వహించగా అదే గ్రామానికి చెందిన సిరిపురపు శ్రీనును 20 లీటర్ల నాటు సారా తో అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీ కి పంపించడం జరిగింది. దర్యాప్తులో ఈ కేసుతో ప్రమేయం ఉన్న చినమేరంగి గ్రామానికి చెందిన బొమ్మాళి సునీల్,చిన్న పై కూడా కేసు నమోదు చేసినట్లు ఆయన





తెలిపారు. కురుపాం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో సీజ్ చేసిన సుమారు 190 లీటర్ల నాటుసారా,మరియు 16 లీటర్ల మద్యంను ఉమ్మడి విజయనగరం డిప్యూటీ కమిషనర్,ఉత్తర్వులు మేరకు ధ్వంసం చేయడమైనది. ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ విజయవంతానికి మీడియా విస్తృత ప్రచారం అవసరం

- జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలు, పురోగతిని వివరించిన జిల్లా కలెక్టర్
- ప్రత్యేక కంట్రోల్ రూమ్.. 24ఐ7 గ్రామ సచివాలయాలు..
- ప్రతి బీఎల్ఓకు 12 మంది సహాయక సిబ్బంది

**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు/ గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూలై 8:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్--2026) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ముద్రిత, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ విలేకరులను కోరారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలు, కార్యక్రమ పురోగతిని ఆమె వివరించారు. జిల్లాలో ప్రతి బీఎల్ఓకు 12 మంది సహాయక అధికారులు, సిబ్బందిని నియమించి క్షేత్రస్థాయిలో సర్వే వేగవంతంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. గ్రామసభలు, డండోరా, మైక్ ప్రకటనలు, ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమ పురోగతిని ప్రతి మూడు గంటలకు ఒకసారి బులెటిన్ రూపంలో విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయగా, ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌లు అందుబాటులో ఉంచి ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈఆర్ఓలు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లు, టెలీకాన్ఫరెన్స్‌ల ద్వారా నిరంతర సమీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను వెంటనే క్షేత్రస్థాయికి చేరవేస్తూ, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. డిజిటలైజేషన్‌ను సులభతరం చేసేందుకు ప్రత్యేక బీఎల్ఓ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. గ్రామ సచివాలయాల్లో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ కోసం 24ఐ7 విధానంలో సేవలు కొనసాగుతున్నాయని, అవసరమైన లాజిస్టిక్ సదుపాయాలు కల్పించినట్లు వెల్లడించారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి వారి సహకారం కోరినట్లు పేర్కొన్న కలెక్టర్, జిల్లా అధికారులు, జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, ఇతర ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన ఒక బీఎల్ఓపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ఇద్దరు గ్రామ సచివాలయ సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.



అలాగే కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా తప్పుడు ఫొటోలను రూపొందించి ప్రచారం చేసిన ఒక జిల్లా అధికారికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో వైద్య శాఖను మినహాయించి గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఎస్ఐఆర్ కార్యక్రమంలో పూర్తిస్థాయిలో పాల్గొంటున్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అమరావతి ఛాంపియన్‌షిప్--2026 పోస్టర్ ఆవిష్కరణ

- క్రీడాకారుల ప్రతిభను వెలికితీసే మహత్తర వేదిక ప్రభుత్వ విప్ గణబాబు
- రూ.91.90 లక్షలతో రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మక క్రీడా పోటీలు
- జూలై 15 నుంచి ఆగస్టు 26 వరకు మూడు దశల్లో పోటీలు
- యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపు




**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూలై 8 :** రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'అమరావతి ఛాంపియన్‌షిప్--2026' క్రీడా పోటీల పోస్టర్‌ను విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, మాజీ అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు గణబాబు తన కార్యాలయంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించేందుకు ఈ ఛాంపియన్‌షిప్ ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని అన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, కానీ క్రీడా స్ఫూర్తి, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగడమే నిజమైన విజయమని యువతకు సూచించారు. మాజీ అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడిగా తన అనుభవాలను గుర్తుచేసుకుంటూ, క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి, ఆరోగ్యానికి, నాయకత్వ లక్షణాల పెంపొందింపుకు ఎంతో దోహదపడతాయని చెప్పారు. విశాఖ జిల్లా యువతీ యువకులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటాలని ఆయన పిలుపునిచ్చారు.

విశాఖపట్నం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఛాంపియన్‌షిప్‌లో నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి అనే మూడు దశల్లో పోటీలు నిర్వహించనున్నారు. జూలై 15 నుంచి ఆగస్టు 26 వరకు పోటీలు కొనసాగగా, ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ముగింపు వేడుకలు నిర్వహించనున్నారు.

ఈ ప్రతిష్టాత్మక క్రీడా ఉత్సవంలో ఆర్చరీ, అథ్లెటిక్స్, బాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, చెస్, హాకీ, కబడ్డీ, ఖో-ఖో, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, యోగా తదితర 12 క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి. అండర్--17 (యు -17), అండర్--23 (యు-23) విభాగాల్లో బాలురు, బాలికలకు ప్రత్యేకంగా పోటీలు నిర్వహించనున్నారు. పోటీల విజేతలకు మొత్తం రూ.91,90,000 నగదు బహుమతులు అందజేయనున్నారు. "బిల్డింగ్ ఛాంపియన్స్.. బిల్డింగ్ ఏ స్ట్రాంగర్ ఆంధ్ర" అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ క్రీడా మహోత్సవంలో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది క్రీడాకారులు పాల్గొనే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్. జూన్ గ్యాలిట్ రోడ్రిగ్స్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. సూర్యనారాయణ, అర్జున అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు, అథ్లెటిక్ కోచ్ నారాయణరావు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్‌కు చిన్న శ్రీను ఘన నివాళి



**పద్మనాభం, జూలై 8 (పెన్ పవర్):** మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి సందర్భంగా భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పద్మనాభం మండల పార్టీ కార్యాలయం సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ, వైఎస్ రాజశేఖర రెడ్డి సంక్షేమ పాలనకు కొత్త దిశ చూపిన మహానేత అని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, సేవలు, జలయజ్ఞం, రైతు సంక్షేమ పథకాలు వంటి అనేక ప్రజాహిత కార్యక్రమాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు.

కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ సుంకరి గిరిబాబు, పద్మనాభం మండలం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పనులను పరిశీలించిన తహసీల్దార్, దాడిశెట్టి శైలజ



**పద్మనాభం, జూలై 8 (పెన్ పవర్):** మండలంలోని తాసిల్దార్ దాడిశెట్టి శైలజ అయినాడ గ్రామ పరిధిలోని పోలింగ్ కేంద్రాలు 8, 9తో పాటు రెడ్డిపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 16 నుంచి 19 వరకు తహసీల్దార్, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఏఈఆర్ఓ) మంగళవారం తనిఖీ నిర్వహించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చడంతో పాటు మార్పులు, చేర్పులు, తొలగింపులను నిబంధనల మేరకు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఓటరు జాబితా సవరణలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని బీఎల్‌వోలకు స్పష్టం చేశారు.

## కార్యకర్త కుటుంబానికి టీడీపీ అండ

- రూ.5 లక్షల ప్రమాద బీమా పత్రం అందజేత
- కార్యకర్తల సంక్షేమమే పార్టీకి తొలి ప్రాధాన్యత ఎమ్మెల్యే గణబాబు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూలై 8 :** తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) పేర్కొన్నారు. పార్టీ కోసం, ప్రజల కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తల కుటుంబాలను కష్టకాలంలో ఆదుకోవడం టీడీపీ బాధ్యతగా భావిస్తోందని అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని 57వ వార్డు అసివానిపాలెంకు చెందిన టీడీపీ కార్యకర్త దివంగత పోతురాజు బార్ల అకాల మరణంతో ఆయన కుటుంబానికి పార్టీ తరఫున రూ.5 లక్షల ప్రమాద బీమా మంజూరైంది. ఈ బీమాకు సంబంధించిన అధికారిక పత్రాన్ని బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గణబాబు, పోతురాజు భార్య, నామినీ గౌరి బార్లకు అందజేశారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, పోతురాజు పార్టీ కోసం ఎంతో కష్టపడి పనిచేసిన నిబద్ధత కలిగిన కార్యకర్త అని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని పేర్కొంటూ, అలాంటి కుటుంబాలను ఆదుకోవడం టీడీపీ బాధ్యతగా భావిస్తోందన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నాయకత్వంలో కార్యకర్తల సంక్షేమ విభాగం సమర్థవంతంగా పనిచేస్తోందని గణబాబు తెలిపారు. ప్రమాద బీమా కింద మంజూరైన రూ.5 లక్షల క్లెయిమ్ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారురాలి బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు వెల్లడించారు. ఆపదలో ఉన్న కార్యకర్తల కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా నిలదొక్కుకునేందుకు ఇటువంటి సంక్షేమ పథకాలు ఎంతో ఉపయోగపడతాయని గణబాబు అన్నారు. కార్యకర్తలు పార్టీకి వెన్నెముకలని, వారి కుటుంబాల సంక్షేమం విషయంలో టీడీపీ ఎప్పుడూ వెనుకడుగు వేయదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా అవసరమైన అన్ని విధాలా పోతురాజు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ పెంటకోట అజయ్, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నాయకులు గౌరి బార్లను పరామర్శించి ధైర్యం చెప్పారు.

## స్వామివారిని దర్శించుకున్న విశాఖ జాయింట్ కలెక్టర్ విద్యాధరి దంపతులు

- ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం
- శేషవస్త్రంతో సత్కరించిన ఈవో జల్లేపల్లి వెంకట్రావు



**సింహాచలం, పెన్ పవర్, జూలై 8 :** విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి దంపతులు బుధవారం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంను సందర్శించి, స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం వారికి ఘన స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు జాయింట్ కలెక్టర్ దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాదస్వర మంగళవాయిద్యాలు, వేదపండితుల వేదమంత్రోచ్చారణల నడుమ వారిని ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం సంప్రదాయం ప్రకారం కప్పస్తంభాన్ని ఆలింగనం చేసిన విద్యాధరి దంపతులు గర్భాలయంలోకి వెళ్లి శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేదపండితులు జాయింట్ కలెక్టర్ దంపతులకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం ఈవో జల్లేపల్లి వెంకట్రావు స్వామివారి శేషవస్త్రంతో వారిని సత్కరించి, స్వామివారి ప్రసాదాలతో పాటు ఆలయ చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు, దేవస్థాన సిబ్బంది పాల్గొని జాయింట్ కలెక్టర్ దంపతులకు ఆలయ సంప్రదాయాల ప్రకారం మర్యాదలు నిర్వహించారు. సింహాచలం దేవస్థానంలో ప్రముఖులు, అధికారులు తరచూ స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీగా కొనసాగుతుండగా, జాయింట్ కలెక్టర్ విద్యాధరి దంపతుల దర్శనం కూడా భక్తిపూర్వక వాతావరణంలో జరిగింది.

## రిసెర్చ్ అండ్ పబ్లికేషన్స్ జాతీయ అధ్యాపక సామర్థ్యాభివృద్ధి కార్యక్రమం



**కూర్మన్నపాలెం : పెన్ పవర్,జూలై 8** విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటానమస్ పరిశోధన అండ్ అభివృద్ధి ఆర్ అండ్ డి విభాగం ఆధ్వర్యంలో అధ్యాపకుల కోసం పరిశోధన మరియు ప్రచురణలు అంశంపై మూడు రోజుల జాతీయ అధ్యాపక సామర్థ్యాభివృద్ధి కార్యక్రమం ను జూలై 6 నుంచి 8 వరకు విజయవంతంగా నిర్వహించింది. అధ్యాపకుల్లో పరిశోధనా సామర్థ్యాలను పెంపొందించడం, నాణ్యమైన పరిశోధనా వ్యాస రచనలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, కళాశాలలో పరిశోధనా సంస్కృతిని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాలలోని వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి ఐఐటీ ధారవాడలోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, స్టూడెంట్స్ వెల్ఫేర్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జ్ డా. రాహుల్ జశ్వంత్‌భాయ్ పాండ్యా ముఖ్య వనరుల నిపుణుడిగా పాల్గొన్నారు. పరిశోధనా విధానాలు, పరిశోధన గ్రాంట్ల కోసం ప్రతిపాదనల రూపకల్పన, కృత్రిమ మేధస్సు ఆధారిత అకాడమిక్ రచన, ప్రచురణ నైతిక విలువలు, ప్లేజరిజం నివారణ, జర్నల్ ఇండెక్సింగ్, బిబ్లియోమెట్రిక్ సూచికలు, పీర్ రివ్యూ విధానం, ఓపెన్ యాక్సెస్ ప్రచురణ, అలాగే పరిశోధన నాణ్యతను పెంపొందించడంలో ఏఐ సాధనాల బాధ్యతాయుత వినియోగంపై ఆయన సమగ్రంగా వివరించారు.

మూడు రోజులపాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పరిశోధనలో లోటుపాట్లను గుర్తించడం, నాణ్యమైన పరిశోధనా వ్యాసాల తయారీ, ఏఐ ఆధారిత పరిశోధనా సాధనాల వినియోగం, తగిన పరిశోధనా పత్రికల ఎంపిక, జాతీయ, అంతర్జాతీయ ప్రతిష్ఠాత్మక జర్నల్లలో ప్రభావవంతమైన పరిశోధనా వ్యాసాల ప్రచురణకు అనుసరించాల్సిన ఉత్తమ విధానాలపై సమగ్ర అవగాహన పొందారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల డీన్ -- పరిశోధన ఎ అభివృద్ధి డా. క్రాంతి కుమార్ గంగు సమన్వయం చేశారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్, రెక్టర్ డా. వి. మధుసూదన రావు మాట్లాడుతూ, ఇలాంటి అధ్యాపక సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలు కళాశాలలో పరిశోధనా వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడంలో, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో, అధ్యాపకులను నాణ్యమైన పరిశోధన చేపట్టేందుకు, అధిక ప్రభావం కలిగిన అంతర్జాతీయ జర్నల్లలో పరిశోధనా వ్యాసాలు ప్రచురించేలా ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పరిశోధన, ఆవిష్కరణలు, విద్యా నాయకత్వం, అధ్యాపకుల నిరంతర వృత్తిపరమైన అభివృద్ధికి విజ్ఞాన్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని వారు పేర్కొన్నారు.

## మహిళలు,చిన్నారుల భద్రతపై విద్యార్థులకు పోలీసుల అవగాహన...

- పోక్సో చట్టం,సైబర్ భద్రతపై కీలక సూచనలు...
- నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ....

**నాతవరం,పెన్ పవర్ (జూలై 8):** మహిళలు,చిన్నారులపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ సూచించారు. బుధవారం నాతవరం మండలం డి. ఎర్రవరం జెడ్పీ హైస్కూల్‌ను నాతవరం ఎస్సై వై.తారకేశ్వరరావుతో కలిసి ఆమె సందర్శించి విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రూరల్ సీఐ రేవతమ్మ మాట్లాడుతూ మహిళలు,చిన్నారుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బాలికలు, చిన్నారులపై జరిగే లైంగిక వేధింపులు,దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పోక్సో (గూజూూ) చట్టం గురించి విద్యార్థులకు వివరించారు.ఎలాంటి వేధింపులు,బెదిరింపులు లేదా అనుమానాస్పద ఘటనలు ఎదురైనా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు లేదా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని,అపరిచితులతో వ్యక్తిగత వివరాలు,ఫొటోలు, ఓటీపీలు,బ్యాంకు సమాచారం పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు.ఆన్‌లైన్ మోసాలు,ఫేక్ అకౌంట్లు,సైబర్ వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.అదేవిధంగా మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడిన వారికి చట్టపరంగా కఠిన శిక్షలు ఉంటాయని వివరించారు. ఎలాంటి సమస్య ఎదురైనా ఆలస్యం చేయకుండా పోలీస్ శాఖ అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్-112కు సమాచారం అందించాలని సూచించారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మంచి పౌరులుగా ఎదగాలని, చెడు స్నేహాలు, మాదకద్రవ్యాలు, సోషల్ మీడియా దుర్వినియోగానికి దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చి వారి సందేహాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## 65వ వార్డులో ఘనంగా వై.ఎస్.ఆర్ జయంతి వేడుకలు




**గాజువాక : పెన్ పవర్, జూలై 08**
జివియంసి 65వ వార్డ్ వైసిపి అధ్యక్షుడు మద్దాల అప్పారావు ఆధ్వర్యంలో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జన్మదిన వేడుకలు పిల్లల మధ్యన జరుపుకునావైయస్సార్ కి పూలమాలవేసి ఘనమైన నివాళి అర్పించారు .పిల్లలతో కేక్ కట్ చేయించారు . పిల్లలందరికీ పుస్తకాలు పెన్నులు ఇతర సామాగ్రి కమిటీ ఆధ్వర్యంలో అందరికీ అందజేశారు . వార్డు వైసిపి సీనియర్ నాయకులు నాగిశెట్టి శ్రీను,ఇరోతి గణేష్,జానా సతీష్, పెంటకోట తారక్,ఎన్నేటి కనకారావు, మహేష్ కర్రి గోవిందా, పెంద్రా రాజు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## 21 రోజుల్లో సింహాచలం హుండీకి రూ.1.76 కోట్ల ఆదాయం

- భక్తుల కానుకలతో ఆలయ ఖజానా నిండింది
- బంగారం, వెండి, విదేశీ కరెన్సీ సమర్పణ
- ఈఓ వెంకటరావు ఆధ్వర్యంలో పారదర్శకంగా హుండీ లెక్కింపు



**సింహాచలం, పెన్ పవర్, జూలై 8 :** శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం, సింహాచలంలో భక్తుల విశ్వాసానికి మరోసారి నిదర్శనంగా 21 రోజుల వ్యవధిలో హుండీ ద్వారా రూ.1.76 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. బుధవారం ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, పూర్తి పారదర్శకతతో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎండోమెంట్స్ శాఖ అధికారులు సురేష్, ప్రసాద్, టెంపుల్ సెక్యూరిటీ ఎస్‌పీఎఫ్ పోలీసు బలగాల పర్యవేక్షణతో పాటు ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా మధ్య హుండీలను తెరిచి లెక్కించారు. గత హుండీ లెక్కింపు జూన్ 17న జరగగా, జూలై 8న నిర్వహించిన తాజా లెక్కింపులో మొత్తం 21 రోజుల కాలానికి సంబంధించిన భక్తుల కానుకలను లెక్కించారు. హుండీ ద్వారా మొత్తం రూ.1,76,08,144 ఆదాయం లభించింది. ఇందులో భారతీయ కరెన్సీ నోట్లు రూ.1,65,76,343, నాణేలు రూ.10,31,801 ఉన్నాయి. రోజువారీ సగటు హుండీ ఆదాయం రూ.8,38,483గా నమోదైంది. నగదు కానుకలతో పాటు భక్తులు బంగారం, వెండి రూపంలో కూడా తమ మొక్కులు తీర్చుకున్నారు. హుండీలలో 102 గ్రాముల 600 మిల్లీగ్రాముల బంగారం, 6 కిలోల 250 గ్రాముల వెండి లభించాయి. అదేవిధంగా అమెరికా, యూఏఈ, ఇండోనేషియా, ఇంగ్లాండ్, సింగపూర్, న్యూజిలాండ్, ఖతార్, మలేషియా, శ్రీలంక, డెన్మార్క్, నేపాల్, కువైట్, కొలంబియా తదితర దేశాలకు చెందిన విదేశీ కరెన్సీ కూడా భక్తులు సమర్పించడం విశేషం. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ధర్మకర్త మండలి సభ్యులు కరక దేముడు, నీటుపల్లి మహేష్, మధుపాడ సన్యాసిరావు, కనకాల మురళీమోహన్, గుత్తికొండ శ్రీలత, పెద్దిశెట్టి ఉషశ్రీ, చలుమూరి భారతి పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితుడిగా స్వామి నాయుడు హాజరయ్యారు. అలాగే డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధ, సహాయ కార్యనిర్వహణాధికారులు వాడ్రేవు రమణమూర్తి, పంతం శ్రీనివాస్, పర్యవేక్షణ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, దేవస్థానం సిబ్బంది, శ్రీహరి సేవా వాలంటీర్లు సమన్వయంతో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# నాతవరంలో ఘనంగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి వేడుకలు....

- వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం...
- వైసీపీ నాయకుల నివాళి.....

**నాతవరం, పెన్ పవర్ (జూలై 8):** దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి సందర్భంగా అనకాపల్లి జిల్లా నాతవరం మండల కేంద్రంలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళుల కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి వైసీపీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైసీపీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి పేరు రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. రైతులు, పేదలు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు వంటి అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎన్నో విప్లవాత్మక పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడిగా వైఎస్సార్ గుర్తుండిపోతారని పేర్కొన్నారు. ఆయన చేపట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, జలయజ్ఞం వంటి పథకాలు సామాన్య ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయని నాయకులు కొనియాడారు. ప్రజా సంక్షేమానికి ఆయన చూపిన అంకితభావం నేటి తరానికి ఆదర్శమని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి వైసీపీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నాతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేసి మానవతా దృక్పథాన్ని చాటారు. ఈ సందర్భంగా రోగుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుంటూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో



ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీ పైల సునీల్, జడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైల పోతురాజు, సినీ నటుడు జోగినాయుడు, గ్రామ మాజీ ఉపసర్పంచ్ కరక అప్పలరాజు, వైసీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బండారు నాయుడు, మండల నాయకులు సిరసపల్లి నరసింగరావు, గొర్లె వరహాలబాబు, మంకు సాంబమూర్తి, కాళ్ల సత్యనారాయణ, అప్పిరెడ్డి మహేష్, చెక్కా జోగిరాజు, మహిళా నాయకులు మకామిరెడ్డి లక్ష్మి, పోలుపర్తి రాధ, మాజీ సర్పంచ్ గొలగాని రాణి, గ్రామ వైసీపీ అధ్యక్షుడు శెట్టి లచ్చబాబు, యువ నాయకులు చిటికెల రామకృష్ణ, కంభే వంశీ, చింతకాయల సత్యనారాయణ, లంక రాంబాబుతో పాటు పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అవసరమైతే ఇదే వార్తను ఈనాడు/సాక్షి శైలి లేఅవుట్ లేదా న్యూస్‌పేపర్ కాలమ్ రూపంలో కూడా సిద్ధం చేసి ఇవ్వగలను.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి "వైయస్ఆర్ "

ఘనంగా గుజ్జుమానుపాకల్లో వైయస్సార్ 77వ జయంతి వేడుకలు



**కొయ్యూరు, పెన్ పవర్ జూలై 8:** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి అని కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్ బాబు అభిప్రాయపడ్డారు. బుధవారం మండలంలోని గుజ్జుమానుపాకలు లో వైయస్సార్ పార్టీ మండల అధ్యక్షులు బిడిజన అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన 77వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఎంపీపీ రమేష్ బాబు మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వైయస్ రాజశేఖర్ రెడ్డి అని ఆయన ప్రవేశపెట్టిన పథకాలు నేటికీ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. అనంతరం వైయస్సార్ స్టేట్ నాయకులు పలువురు మండల నాయకులు కేకును కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు జల్లి బాబులు. నీలపు సూరిబాబు, రేగేటి ముసలి నాయుడు, అచ్యుత్, పెట్ల గాంధీ, తదితర వైయస్సార్ అభిమానులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి భద్రతకు ప్రాధాన్యం... వెదురు పొదల తొలగింపు చేపట్టిన పోలీసులు--అటవీ శాఖ......

- ప్రయాణికుల సురక్షిత రాకపోకలే లక్ష్యం...
- ఎస్సై వై.తారకేశ్వరరావు...



**నాతవరం,పెన్ పవర్ (జూలై 8):** నాతవరం మండలంలోని గాంధీనగరం సమీపంలో నర్సీపట్నం--తుని ప్రధాన ఆర్అండ్‌బీ రహదారిపై ప్రయాణికులకు ఇబ్బందులు, ప్రమాదాలకు కారణమయ్యే విధంగా రహదారికి అడ్డంగా విస్తరించిన వెదురు పొదలను బుధవారం నాతవరం పోలీస్ స్టేషన్ సిబ్బంది, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా తొలగించారు. ఈ సందర్భంగా నాతవరం ఎస్సై వై. తారకేశ్వరరావు మాట్లాడుతూ, రహదారిపై వాహనదారులకు స్పష్టమైన దృశ్యమానత కల్పించడంతో పాటు ప్రమాదాలను నివారించేందుకు ఈ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం వెదురు పొదలను గణనీయంగా తొలగించినట్లు పేర్కొంటూ, మిగిలిన జంగిల్ క్లియరెన్స్ పనులను కూడా రాబోయే రెండు నుంచి మూడు రోజుల్లో పూర్తి చేసి రహదారిని మరింత సురక్షితంగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీస్ శాఖ, అటవీ శాఖ సమన్వయంతో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన తెలిపారు.

# సహోద్యోగి కుటుంబానికి సింహాచలం దేవస్థానం అండ

- దివంగత ఉద్యోగి కుటుంబానికి రూ.2.59 లక్షల ఆర్థిక సాయం
- ఉద్యోగుల సేవాభావం అభినందనీయం : ఈఓ జల్లేపల్లి వెంకటరావు

**సింహాచలం, పెన్ పవర్, జూలై 8 :** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ అకాల మరణం చెందిన ఎర్రబోలు శ్యామ్ కుటుంబానికి దేవస్థానం ఉద్యోగులు మానవతా దృక్పథంతో అండగా నిలిచారు. శాశ్వత, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు వివిధ సేవా సంఘాలు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి మొత్తం రూ.2,59,700 ఆర్థిక సహాయాన్ని అందజేయడం ఉద్యోగుల ఐక్యతకు, సేవాభావానికి నిదర్శనంగా నిలిచింది. బుధవారం కొండపై నిర్వహించిన కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు దివంగత ఉద్యోగి ఎర్రబోలు శ్యామ్ సతీమణికి ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఈఓ జల్లేపల్లి వెంకటరావు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న తోటి ఉద్యోగి కుటుంబాన్ని ఆదుకోవడానికి శాశ్వత, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా ఒక్కటిగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఉద్యోగుల ఐక్యత, మానవత్వం, సేవా దృక్పథానికి ఈ సహాయం నిదర్శనమని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సాయం శ్యామ్ కుటుంబానికి కొంత భరోసా కలిగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగులు అందించిన స్వచ్ఛంద విరాళాలతో పాటు శ్రీ వరాహ



లక్ష్మీనరసింహస్వామివారి సేవా సంఘం రూ.17,100, శాంతి గారి సేవా సంఘం రూ.23,000, దేవస్థానం మాజీ ధర్మకర్త సంపంగి శ్రీనివాసరావు రూ.10,000 విరాళంగా అందజేసి తమ సహృదయతను చాటుకున్నారు. దివంగత ఎర్రబోలు శ్యామ్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు స్వామివారి ఆశీస్సులతో మనోధైర్యం, ఆర్థిక భరోసా లభించాలని ఈఓ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారులు కె. తిరుమలేశ్వరరావు, వాడ్రేవు రమణమూర్తి, పిల్లా శ్రీనివాసరావు, డీఈ రామరాజు, దేవస్థానం సిబ్బంది, వివిధ సేవా సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# కొడుకు ఆకస్మిక మృతి తో తల్లి మృతి





**గాం కొండలో విషాదఛాయలు..**

**కొయ్యూరు, పెన్ పవర్ జులై 8:** కొడుకు ఆకస్మిక మరణ వార్త విన్న మాతృమూర్తి కూడా మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలో నడింపాలెం పంచాయితీ శివారు గ్రామమైన గాంకొండకు చెందిన పోత్తూరు సత్యనారాయణ(46) బంధువులు శుభకార్యానికి జీకే వీధి మండలం గండేపల్లి వెళ్లి వారం రోజులు పాటు అక్కడే ఉండడంతో మలేరియా టైఫాయిడ్ జ్వరంతో రావడంతో మంగళవారం పెదవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు పొంది ఇంటికి తిరిగి వచ్చారు. అదే సమయంలో తల్లి పోత్తూరు రాజులమ్మ(70) గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉంది. దీంతో ఆమెను చూస్తూ ఒక్కసారిగా అపస్మారక స్థితికి చేరుకొని మంగళవారం రాత్రి 11 గంటలు సమయంలో సత్యనారాయణ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొడుకు మరణ వార్త విన్న తల్లి కుప్పకూలి పోయి వెంటనే రాజులమ్మ కూడా ఒక్కసారిగా గుండె ఆగిపోయి మరణించినట్లు కుటుంబీకులు తెలిపారు. పోత్తూరు సత్యనారాయణ కు పెళ్లి కాకపోవడంతో తనకంటే తన కొడుకు ముందు చనిపోతే ఎవరు చూసేవారు ఉండరని తాను వెంటనే చనిపోతానని ఎప్పుడు చెబుతూ ఉండేదని అదే విధంగా కొడుకు మరణ వార్త విన్న తల్లి మృతి చెందడంతో గ్రామస్తులంతా షాకుకు గురయ్యారు. దీంతో ఒకే కుటుంబానికి చెందిన తల్లి కొడుకు మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదఛాయలు అలుము కోవడంతో కుటుంబీకులు గ్రామస్తులు బోరున విలపిస్తుండటంతోపరామర్శించేందుకు వెళ్లినవారు కంటతడి పెట్టుకున్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి....

- టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులు, బూత్ కన్వీనర్లకు మండల టీడీపీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ పిలుపు.....



**నాతవరం,పెన్ పవర్ (జూలై 8)** నాతవరం మండలంలోని ప్రతి పంచాయతీలో ఎస్ఐఆర్ (ஜ×=) కార్యక్రమాన్ని మరింత వేగవంతంగా పూర్తి చేయాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, బూత్ కన్వీనర్లకు బుధవారం ముఖ్య విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని కొన్ని గ్రామాల్లో ఎస్ఐఆర్ కార్యక్రమం వేగంగా సాగుతుండగా, మరికొన్ని గ్రామాల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేదని తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రతి పంచాయతీలో బూత్ కన్వీనర్లతో పాటు ఆయా గ్రామాల పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రతి బూత్‌లో చురుకుగా పనిచేసి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## పలక జీడి ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం

వైద్యాధికారి "హేమంత్ చౌదరి"



**కొయ్యూరు, పెన్ పవర్ జులై 8 :**వ్యక్తి గత పరిశుభ్రత తోనే విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉంటారని యూ. చీడి పాలెం వైద్యాధికారి హేమంత్ చౌదరి అన్నారు. మండలంలో పలక జీడి గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలను వైద్యాధికారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాలలో విద్యార్థులు ఆరోగ్యం పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉండడంతో పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం పలువురు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి.....

**నిర్దేశిత గడువులోగా ఓటరు సర్వే పూర్తి చేయాలి....**

**తహశీల్దార్ ఓ.చందనరేఖ....**

**నాతవరం,పెన్ పవర్ (జూలై 8):**స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, నిర్దేశిత గడువులోగా ఓటరు సర్వేను పూర్తి చేయాలని నాతవరం తహశీల్దార్ ఓ. చందనరేఖ అధికారులను ఆదేశించారు. బుధవారం నాతవరం ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సూపర్వైజర్లు, బీఎల్‌వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీలోగా ఇంటింటి ఓటరు సర్వేను పూర్తిస్థాయిలో ముగించాలని సూచించారు. బీఎల్‌వోలు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లు లేదా నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, మరణించిన వారు లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి అవసరమైన మార్పులు చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీడీఓ ఎం.ఎస్. శ్రీనివాస్, మండల పరిషత్ ఏవో పార్థసారధి, మండల టీడీపీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, డీటీ టీవీఆర్ రాజు,గన్నవరం పీఏసీఎస్ అధ్యక్షులు సింగంపల్లి సన్యాసిదేముడు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా వై.యస్ రాజశేఖర రెడ్డి 77 వ జయంతి వేడుకలు

## పలు సేవా కార్యక్రమాలలో పాల్గొన్న జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు కే కే రాజు



**విశాఖ తూర్పు,పెన్ పవర్ జూలై 8:** దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు జిల్లా అధ్యక్షులు కే కే రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.
నగరంలో పలు ప్రాంతాలలో నిర్వహించిన జయంతి వేడుకలు,నిర్వాహకులు నిర్వహించిన పలు సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. నగర పార్టీ కార్యాలయంలో జిల్లా సంస్కృతిక విభాగం అధ్యక్షులు వంకాయల మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో డా" శ్రీ వై.యస్ రాజశేఖర రెడ్డి గారి విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి, పేద ప్రజలకు చీరలు పంపిణీ చేశారు.
పార్క్ హోటల్ జంక్షన లో గల వై.యస్.ఆర్ విగ్రహం వద్ద రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి పివి నారాయణ. రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు కేక్ కటింగ్ చేసి,ప్రజలకు చీరలు పంపిణీ,ఆంద్ర విశ్వవిద్యాలయం లో విద్యార్ధి,ఉద్యోగలు విభాగం ఆధ్వర్యంలో మైయిన్ గేటు వద్ద వై.యస్.ఆర్ విగ్రహానికి పాల అభిషేకం,
జిల్లాపరిషత్ వద్ద ఉన్న సెయింట్ జోసెఫ్ ఓల్డేజ్ హోమ్ లో జిల్లా యువజన విభాగం అధ్యక్షలు ఊరుకుటి చందు ఆధ్వర్యంలో వృద్దులకు పండ్లు మరియు బ్రేడ్ పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా కి కి రాజు మాట్లాడుతు..ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత,దివంగత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి అని, ఆయన 77వ జయంతిని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. వైఎస్సార్ కేవలం ఒక ముఖ్యమంత్రి మాత్రమే కాదు...పేదల ఆశాకిరణం, రైతుల ఆత్మవిశ్వాసం, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన మహానాయకుడు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి, అధికారాన్ని ప్రజాసేవకు అంకితం చేసిన అరుదైన నాయకుడు. రైతులకు ఉచిత విద్యుత్, పేదలకు ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు చేయూత, ఇందిరమ్మ ఇళ్లు, జలయజ్ఞం వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన మహానుభావుడు వైఎస్సార్ ఆ మహానేత ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ, ఆయన చూపిన సంక్షేమ పాలనను మరింత విస్తృతంగా ప్రజలకు అందించిన నాయకుడు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి తండ్రి ఆశయాలను తన జీవిత లక్ష్యంగా మార్చుకుని, ప్రతి పేద కుటుంబం అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమనే నమ్మకంతో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారనారు.
జయంతి సందర్భంగా మనమంతా వైఎస్సార్ ఆశయ సాధన కోసం మరింత అంకితభావంతో పనిచేద్దాం. పేదల పక్షాన నిలబడదాం. ప్రజాసేవనే పరమావధిగా భావిస్తూ ఆయన చూపిన మార్గంలో నడుద్దాం.
ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు, పిఏసి సభ్యులు తిప్పల నాగిరెడ్డి,విశాఖ పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు,జిల్లా పరిషత్ చైర్మన్ జల్లుపల్లి సుభద్ర, శాసనమండలి సభ్యురాలు వరుదు కల్యాణి,మాజీ మంత్రివర్యులు పసుపు లేటి బాల రాజు మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్ , తైనాల విజయ కుమార్ సమన్వయకర్తలు తిప్పల దేవన్ రెడ్డి,మొల్లి అప్పారావు, నియోజకవర్గ పరిశీలకులు జహీర్ అహ్మద్,పేడాడ రమణి కుమారి,మాజీ మేయర్ గోగాని హరి వెంకట కుమారి , పార్టీ కార్యాలయం పర్యవేక్షకులు రవి రెడ్డి పార్టీ సీనియర్ నాయుకులు కోలా గురువులు,కటుమురి సతీష్, రొంగలి జగన్నాధం,సతీష్ వర్మ, మంచ నాగమల్లేశ్వరి, కిరణ్ రాజు , పళ్ళ దుర్గ , ఉమ్మడి స్వాతి , జి వి రామ్ చంద్ర రావు రమణి రెడ్డి , జోన్ వెస్లీ, పేర్ల విజయ్ చందర్, జివి రవి రాజు, సేనాపతి అప్పారావు ,ద్రోణం రాజు శ్రీ వాత్సవ్ , జీలకర్ర నాగేంద్ర , అనిల్ కుమార్ రాజు , గొలగాని శ్రీనివాస్, పివి సురేష్ , అంబటి శైలేష్ , ఎం సునీల్ , బర్కత్ ఆలీ. సత్యనారాయణ, షేక్ ఖాన్, రెయ్యి వెంకటరమణ , మహమ్మద్ ఇమ్రాన్, మువ్వల సురేష్,ఆడారి దివ్య కళ, , రామరాజుడేవిడ్, ఈశ్వరరావు,బెందేలం పద్మావతి,రాయుడు శ్రీను , ఉమ్మిడి స్వాతి దాసు. తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా మహానేత వైఎస్సార్

- గూడెం కొత్తవీధిలో అట్టహాసంగా 77వ జయంతి వేడుకలు
- భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 8**:దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై .ఎస్ . రాజశేఖర రెడ్డి 77వ జయంతి వేడుకలు గూడెం కొత్తవీధి మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని మహానేతకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన జన్మదిన కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. హాజరైన కార్యకర్తలు, అభిమానులకు మిఠాయిలు పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ రాష్ట్ర కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, మండల వైసీపీ అధ్యక్షుడు కంకిపాటి గిరిబాబు, ఎంపీపీ బోయిన కుమారి మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగించిన మహానేత వైఎస్సార్ అమలు చేసిన ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు సంక్షేమ పథకాలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు నేటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవకు అంకితభావంతో పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గూడెం కొత్తవీధి మండల అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్, ఎంపీపీ బోయిన కుమారి, వైసీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, వైస్ ఎంపీపీ లోత దేముడు, మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, మండల ఉపాధ్యక్షుడు వంతల అరుణ్ కుమార్,జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు వనపల రాజేష్, సోషల్ యూత్ మీడియా అధ్యక్షుడు పాతును, లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ కొర్ర సుభద్ర,ఎస్టీ సెల్ అధ్యక్షుడు కంకిపాటి నారాయణ, పెదవలస వైసిపి అధ్యక్షులు కంకిపాటి శ్రీరాములు, నాయకులు కొర్రబాబి,అరికట్ట అంజి, కొర్ర రాంబాబు, పొత్తూరు గంగరాజు, చిట్టిబాబు, సోభాయి రామ్మూర్తి, పాంగి చందు, కేశవరావు, బొబ్బిలి వెంకటరావు, గొల్లూరి సుబ్బారావు, వంతల జగత్, కంకిపాటి ప్రకాష్, వంతల అప్పారావు, లంబసింగి రమేష్, కొర్ర దేవదాసు, బోయిన వెంకట్,కొర్ర నూకరాజుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 1/70 చట్టాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత

- పార్టీలకు అతీతంగా గిరిజన హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటం చేయాలి: వైఎస్సార్‌సీపీ నేతలు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూలై 8:**గిరిజనుల హక్కులకు రక్షణ కవచంగా నిలిచిన 1/70 చట్టాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండల కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, ఎంపీపీ బోయిన కుమారి, మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిబాబు ఆధ్వర్యంలో బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 1/70 చట్టాన్ని సడలించాలని కోరుతూ కొంతమంది గిరిజనేతరులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. గిరిజనుల భూమి, హక్కులు, చట్టాలను పరిరక్షించేందుకు రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు."ఆదివాసుల ఐక్యత వర్ధిల్లాలి... 1/70 చట్టాన్ని పరిరక్షించుకోవాలి" అంటూ నాయకులు నినాదాలు చేశారు. గిరిజనుల హక్కుల విషయంలో రాజీకి తావులేదని, చట్ట పరిరక్షణ కోసం అవసరమైన ప్రతి చర్యలో ముందుండి పోరాడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వంతల చంటిబాబు, వంతల అరుణ్ కుమార్, అరికట్ట ఆంజనేయులు, వనపల రాజేష్, కంకిపాటి నారాయణ, మత్స్యరాజు, పాతూను లక్ష్మణ్, శ్రీరాములు, బొబ్బిలి వెంకటరావుతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేద ప్రజల గుండెల్లో వైయస్సార్ కు సుస్థిర స్థానం

- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



**నర్సీపట్నం, పెన్ పవర్ (జూలై 8) :** దివంగతనేత, స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతిని నర్సీపట్నంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో నాలుగు మండలాల్లోని వైయస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.
నర్సీపట్నం మున్సిపాలిటీలో ఎన్టీఆర్ స్టేడియంలోని వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. వైయస్సార్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గణేష్ మీడియాతో మాట్లాడుతూ పేద ప్రజల గుండెల్లో వైయస్సార్ సుస్థిరస్థానం సంపాదించుకున్నారని అన్నారు. వైయస్సార్ పేరు వినగానే అనేక సంక్షేమ పథకాలు గుర్తుకు వస్తాయని అన్నారు. ఆరోగ్యశ్రీ, 104, 108 వంటి సంక్షేమ పథకాలు ఎంతోమంది పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాయన్నారు. ఫీజు రియంబర్స్మెంట్ ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించారన్నారు. చివరిలో వైయస్సార్ కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి చింతకాయల సన్యాసిపాత్రుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఏకా శివప్రసాద్, చింతకాయల వరుణ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, సుర్ల నాయుడుబాబు, వికాస్ సతీష్, బేతిరెడ్డి విజయకుమార్, మల్ల గణేష్, కర్రి శ్రీనివాసరావు, లగుడు స్వామి, వీరమాచినేని జగదీశ్వరి, అల్లంపల్లి లావణ్య, బయ్యపురెడ్డి గణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## భోగాపురం ఎయిర్‌పోర్టు కనెక్టివిటీ రోడ్ల పనులు వేగవంతం చేయాలి

- వేపగుంట,జుత్తాడ, వేపగుంట,పినగాడి రోడ్లను త్వరగా పూర్తి చేయాలి
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జూలై 8 :** భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంకు అనుసంధానంగా చేపడుతున్న రహదారి విస్తరణ, అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. బుధవారం పెందుర్తి జోన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన స్వయంగా పరిశీలించి, పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. కమిషనర్‌తో పాటు జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ పి.వి.వి. సత్యనారాయణరాజు, పెందుర్తి జోనల్ కమిషనర్ హెచ్.శంకర్రావు, పర్యవేక్షక ఇంజనీర్ కె.శ్రీనివాసరావు, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. వేపగుంట జంక్షన్ నుంచి జుత్తాడ వరకు 6.34 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న నూతన రహదారి పనులను కమిషనర్ పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలిన పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రహదారి ప్రారంభం, చివరి భాగాల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా రెండు వైపులా విశాలంగా అభివృద్ధి చేసి చిన్న జంక్షన్ల తరహాలో రూపొందించాలని సూచించారు.
ప్రస్తుతం కొనసాగుతున్న పనులను ఏడు రోజుల్లో పూర్తి చేయాలని, మిగిలిన రోడ్డు నిర్మాణంతో పాటు తారు రోడ్డు పనులను కూడా వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. అనంతరం వేపగుంట నుంచి పినగాడి జంక్షన్ వరకు 3.92 కిలోమీటర్ల మేర 60 అడుగుల వెడల్పుతో విస్తరిస్తున్న రహదారి పనులను కమిషనర్ పరిశీలించారు. రోడ్డు విస్తరణతో పాటు కాలువల నిర్మాణం, నీటి పైపులైన్ పనులను సమన్వయం చేసుకుంటూ అన్ని మౌలిక సదుపాయాలతో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి ముందే ప్రధాన అనుసంధాన రహదారులను పూర్తి చేసి ప్రజలకు, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా జీవీఎంసీ చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజనీర్ దిలీప్, ఏసీపీ రామలింగేశ్వర రెడ్డి, ఏఈలు, ప్లానింగ్ అధికారులు, వార్డ్ అమెనిటీస్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు జీవితాన్నే అంకితం చేసిన మహానేత రాజశేఖర్ రెడ్డి



**జియ్యమ్మవలస జులై 08 పెన్ పవర్.** జియ్యమ్మవలసలో దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని బుధవారం నాడు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వైయస్ రాజశేఖర్ రెడ్డి జ్ఞాపకార్థంగా ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ మేరకు మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి మాట్లాడుతూ,రాష్ట్ర ప్రజల సంక్షేమానికి జీవితాన్నే అంకితం చేసిన మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆయన చేసిన ప్రజాసేవ ఎన్నటికీ మరవకూడదని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ఆయన జీవితాన్ని ప్రజలకి అంకితం చేశారని మరొక్కసారి పుష్పశ్రీవాణి గుర్తుచేస్తూ కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 50 పడకల ఆసుపత్రి ను సందర్శించిన డిసిహెచ్ఎస్.



**గుమ్మలక్ష్మీపురం జులై 08 పెన్ పవర్.** గుమ్మలక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన భద్రగిరి 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని డీసీహెచ్ఎస్ నాగభూషణరావు బుధవారం సందర్శించారు. ముందుగా ప్రస్తుతం ఉన్న ఆసుపత్రిలో ఓపీ,వార్డులు,పరీక్షల నిర్ధారణ పరికరాలను పరిశీలించి రోగులతో మాట్లాడి వఅందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. డి.సి.హెచ్.ఎస్ నాగభూషణరావు మాట్లాడుతూ,ఈ వచ్చేది వర్షాకాలం కావడంతో సీజనల్ జ్వరాలు ఎక్కువగా ఉంటాయని వాటిపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచి పరీక్షలు నిర్వహించి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైద్యులకు సూచనలు ఇచ్చారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే జగదీశ్వరిని కలిసి ఈనెల 22న కొత్త ఆసుపత్రి ప్రారంభం కానున్నదని ఈ ప్రారంభానికి ముఖ్యఅతిథిగా రావాలని ఆమెను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## దుచ్చరపాలెంలో జేసీ ఆకస్మిక తనిఖీ

- ఎస్ఐఆర్ సర్వే పురోగతిపై సమీక్ష
- 60 శాతం మాత్రమే పూర్తి.. మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశం




**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 8:** మండలంలోని దుచ్చరపాలెం గ్రామం (పోలింగ్ కేంద్రం--31)లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) సర్వే పురోగతిని జాయింట్ కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న సర్వే తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇప్పటివరకు కేవలం 60 శాతం మాత్రమే సర్వే పూర్తవడంతో, మిగిలిన పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సాంకేతిక సమస్యలు, క్షేత్రస్థాయి సమన్వయ లోపాలు లేకుండా సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అదనపు సిబ్బందిని వినియోగిస్తూ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, మిగిలిన 40 శాతం సర్వేను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని తహసీల్దార్ హెచ్. అన్నాజీరావుకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా శాతం వందకు వంద సర్వే పూర్తి చేయాలని, పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆకస్మిక తనిఖీలో స్థానిక రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించండి

**సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్స్ ర్లతో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్**

**విశాఖ తూర్పు,పెన్ పవర్ జూలై 08:** జిల్లాలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశో?ర్ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్స్ ర్లకు సూచించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగు హాలులో వారితో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన పలు అంశాలపై వారికి స్పష్టత ఇచ్చారు. సర్ ప్రక్రియ గురించి విపులంగా వివరించారు. దీనిపై సంపూర్ణ అవగాహన కల్పించుకోవటంతో పాటు, సరైన సమాచారంతో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు అనేది ప్రాథమిక హక్కు అని దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. సర్ ప్రక్రియలో భాగంగా బీఎల్వో అందజేసిన ఈఎఫ్ పత్రం తప్పకుండా తిరిగి ఇవ్వాలని లేదంటే సదురు ఓటరు పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉండదని స్పష్టం చేశారు. 2002 జాబితాలోని వివరాలను ప్రస్తుత ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియ జిల్లాలో పారదర్శకంగా జరుగుతోందని, 2002లో సదరు ఓటరు నమోదు కాకపోయినా.. ఇబ్బందేం లేదని కాకపోతే తాజాగా తనకు ఎక్కడ ఓటు ఉంది, మొన్నటి ఎన్నికల్లో ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటు వేశారో తెలియజేస్తూ, ప్రాథమిక వివరాలతో నింపిన ఈఎఫ్ పత్రాన్ని సంతకం చేసి బీఎల్వోకు వెనక్కి తిరిగి ఇవ్వాలని ఓటర్లకు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఇవే అంశాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతం తీసుకెళ్లాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఇన్ఫ్లుయెన్స్ ర్లకు చెప్పారు.
డిప్యూటీ కలెక్టర్ టి. గోవిందు, ఐడపీఆర్ డీడీ కె. సదారావు, ఏఈఐఈ శ్రీనివాసరావు, డివిజనల్ పీఆర్వో నారాయణరావు, ఏఐఈ రామకృష్ణ, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అల్లూరి జిల్లాను జోన్-1లోనే కొనసాగించాలి

* 1/70 చట్టం పరిరక్షణతో పాటు గిరిజన హక్కులకు భరోసా కల్పించాలి
* ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు కిట్లంగి పెద్దబ్బాయి

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 7:**అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్-1లోనే కొనసాగిస్తూ, గిరిజనుల హక్కులను పరిరక్షించే 1/70 చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలని గూడెం కొత్తవీధి మండల ఏపీటీఎఫ్ అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు కిట్లంగి పెద్దబ్బాయి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, అల్లూరి జిల్లా పూర్తిగా గిరిజన, ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఇక్కడి ప్రత్యేక భౌగోళిక పరిస్థితులు, వెనుకబాటుతనం, విద్యా, వైద్య సౌకర్యాల కొరత వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని జోన్-1 హోదాను కొనసాగించడం అత్యంత అవసరమని అన్నారు.జోన్-1 కొనసాగితే స్థానిక గిరిజన యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యం లభిస్తుందని, స్థానికత హక్కులు పరిరక్షించబడతాయని తెలిపారు. అలాగే గిరిజనుల భూములు, ఆస్తులు, హక్కులను కాపాడేందుకు అమల్లో ఉన్న 1/70 చట్టం కూడా ఏజెన్సీ ప్రాంతాల రక్షణకు కీలకమైనదని పేర్కొన్నారు. జోన్-1 వ్యవస్థ, 1/70 చట్టం రెండూ గిరిజనుల భవిష్యత్తుకు రక్షణ కవచాలుగా నిలుస్తాయని అన్నారు.అల్లూరి జిల్లాను జోన్-1 నుంచి తొలగించడం లేదా 1/70 చట్టాన్ని బలహీనపరిచే ఎలాంటి చర్యలు తీసుకున్నా స్థానిక గిరిజన యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని, గిరిజనుల హక్కులు దెబ్బతినే పరిస్థితులు ఏర్పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు.అందువల్ల గిరిజన ప్రాంతాల ప్రత్యేకతను, రాజ్యాంగ పరిరక్షణలను దృష్టిలో ఉంచుకుని అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్-1లోనే కొనసాగించడంతో పాటు 1/70 చట్టాన్ని మరింత పటిష్ఠంగా అమలు చేసి గిరిజనుల హక్కులను పరిరక్షించాలని ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కిట్లంగి పెద్దబ్బాయి విజ్ఞప్తి చేశారు.



03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# నేషనల్ హైవే సిగ్నల్ ఫ్రీ జంక్షన్ ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి.



* జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.

**విశాఖ తూర్పు,పెన్ పవర్,జూలై 8:**నగర పరిధిలో నేషనల్ హైవే లో పలు జంక్షన్ లను సిగ్నల్ ఫ్రీ గా తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళిక లను సిద్ధం చేయాలని జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ పివివి సత్యనారాయణ రాజుకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు.బుధవారం ఆయన జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సత్యం జంక్షన్ వద్ద సిగ్నల్ ఫ్రీ జంక్షన్ అభివృద్ధికి పరిసరాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో వాహనాల రాకపోకల వలన హైవే జంక్షన్లలో సిగ్నల్స్ వద్ద అంతరాయం కలుగుతూ ఎక్కువ సమయం ట్రాఫిక్ నిలిచిపోతుందని ,తద్వారా వాహనదారులు నిర్ణీత సమయంలో గమ్యం చేరలేక ట్రాఫిక్ లో చిక్కుకొని ఇబ్బంది పడుతున్నారని, అలాగే ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని అన్నారు. అందుకు వాహనాల రాకపోకలకు సౌకర్యార్థం నేషనల్ హైవే లో పలు జంక్షన్ల ను అభివృద్ధి చేస్తూ సిగ్నల్ ఫ్రీ జంక్షన్లుగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధం చేయమని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఈ పరిశీలనలో సత్యం జంక్షన్ వద్ద నిప్పాన్ కోయి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు సిగ్నల్ ఫ్రీ జంక్షన్ల అభివృద్ధికి కమిషనర్ కు పలు సూచనలను వివరించారు. కమిషనర్ వాటిని పరిశీలించి నేషనల్ హైవేలో పలు జంక్షన్ లైన సత్యం జంక్షన్,అక్కయ్యపాలెం, గాజువాక శ్రీనగర్, ఎండాడ జంక్షన్ల వద్ద స్థల పరిశీలన, అవసరమగు రోడ్డు విస్తరణకు మొదలగు అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సిగ్నల్ ఫ్రీ జంక్షన్ లుగా తీర్చిదిద్దేందుకు , ప్రజలు,వాహనాల రాకపోకలకు సౌకర్యవంతంగా ఉండేలా అభివృద్ధికి ప్రణాళికలను , సంబంధిత నమూనాలను సిద్ధం చేసి నివేదికను సమర్పించాలని ప్రధాన ఇంజనీర్ పి వి సత్యనారాయణ రాజుకు కమిషనర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజనీర్ సంపత్ కుమార్, కార్యనిర్వాహక ఇంజనీర్ పద్మావతి, ఉపకార్య నిర్వాహక ఇంజనీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పెదబాబుకు ముంచంగిపుట్టు ప్రెస్ క్లబ్ కన్నీటి నివాళి

**ముంచంగిపుట్టు తొలితరం పాత్రికేయుడి స్మరణార్థం సంతాప సభ.**
**కలం ఆగిన అక్షరం ఆగదు.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 08.**ముంచంగిపుట్టు మండలానికి చెందిన సీనియర్ పాత్రికేయులు బోనం పెదబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పెదబాబు సంతాపసభను బుధవారం ముంచంగిపుట్టు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. మొదటిగా జ్యోతి ప్రజ్వలన చేసి పెదబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు పెదబాబును ఉద్దేశించి మాట్లాడుతూ.. కలం ఆగిన అక్షరం ఆగదని, గొంతు మూగైన సత్యం మూగబోదని, మంచి మనిషి దూరమైన జ్ఞాపకం దూరం కాదని, పాత్రికేయుడు వెళ్లిపోయిన ఆయన విలువలు మరణించావని బోనం పెదబాబుకు పలువురు వక్తలు ఆయన సేవలను కొనియాడుతూ ప్రగాఢ అక్షర నివాళులర్పించారు. ముంచంగిపుట్టు తొలినాళ్ల పాత్రికేయుడు పెదబాబు సుమారు నాలుగు దశాబ్దాల పాటు పత్రికా రంగంలో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అక్షరమే ఆయుధంగా, నిజమే ఆశయంగా, ప్రజల పక్షాన కలం పట్టిన పాత్రికేయ యోధుడుగానే కాక పత్రికా రంగంతో పాటు నాటక రంగంలో అనేక సామాజిక అంశాలను లేవనెత్తే కథలను ఆయన రాశారని, అలాగే ఎన్నో నాటకాలకు ఆయన దర్శకత్వం వహించారన్నారు. ఆంధ్రప్రభ పత్రికకు ఆభరణంలా నిలిచి, వార్తలకు విలువను, వృత్తికి గౌరవాన్ని తీసుకొచ్చిన మహనీయుడని కొనియాడారు. పెదబాబు కలం నిశ్శబ్దమైన, ఆయన ఆదర్శాలు ఎన్నటికీ మౌనం కావని, ఆయన మాటలు ఆగిపోయినా, ఆయన సేవలు చిరస్మరణీయంగా ఉంటుందన్నారు. అదేవిధంగా ఆయనతో గతంలో పని చేసిన తన సన్నిహితులు గత జ్ఞాపకాలను నెమరు వేసుకునీ కన్నీటి



పర్యంతమయ్యారు. పెదబాబు కుటుంబానికి ముంచంగిపుట్టు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పాడేరు చైతన్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పెనుమాక రవికుమార్ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భాగ్యవతి, టిడిపి మండల అధ్యక్షురాలు కే. సన్యాసమ్మ, సిపిఎం మండల కార్యదర్శి కె.త్రినాద్, వైసిపి పార్టీ మండల అధ్యక్షుడు పి. పద్మారావు, వైసిపి జిల్లా నేతలు జెవివిఎన్ మూర్తి, ఏ, జగబంధు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. నాగరాజు, శారదానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపల్ మత్స్య రాజు, ఉపాధ్యాయ సంఘ నేత కె, శ్రీనివాసమూర్తి, మాజీ సర్పంచులు వి. రమేష్, బి.బాబురావు, నీలకంఠం, వివిధ పార్టీలు, సంఘాల నేతలు మత్స్యలింగం, ఎండి సులేమన్, ఎం.ఎం. శ్రీను, నరసయ్య, ఎం సుబ్బలక్ష్మి, జై దుర్గా వర్తక సంఘం మాజీ అధ్యక్షులు కె.కిషోర్, పెదబాబు స్నేహితులు డాక్టర్ శివాజీ రాజ్, బవర్రాజు, ముంచంగిపుట్టు ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పి. విజయ్ వెంకట్, ఎస్. సురేష్, కాంతారి మోహన్, కూడా మోహన్, కోటి, భాస్కర్, పులి రాజు, కే. అనిల్, కిముడు రాంబాబు, ఉదయ్ కుమార్, బి. శ్రీనివాసరావు, పాడేరు ఏపీడబ్ల్యూజే సభ్యుడు మహేష్ బాబు, పెదబాబు కుటుంబ సభ్యులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గోకవరంలో దివంగత ముఖ్య మంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్రెడ్డి జయంతి వేడుకలు.







**గోకవరం పెన్ పవర్ జులై 08:**-దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు గోకవరంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అత్యంత వైభవంగా నిర్వహించారు.గోకవరం మండలం గోకవరం పాత బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ఎంపీపీ ఆధ్వర్యంలో దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీమంత్రి, జగ్గంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఉభయగోదావరి జిల్లాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీరాంజీ పాల్గొని డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలు వేసి నివాళు లర్పించారు. నాయకులు కార్యకర్తలు అభిమానుల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.అనంతరం గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు,గర్భిణీ,బాలింతలు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోట శ్రీరాంజీ మాట్లాడుతూ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖం లో చెరగని చిరునవ్వు, నడకలో తెలుగుదనం ఉట్టి పడే రాజసం, పేదల గుండెల్లో ఎప్పటికీ జరగని జ్ఞాపకం మన అభివృద్ధి ప్రదాత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. ప్రజా సంక్షేమ పాలనకు సరికొత్త భాష్యం చెప్పిన డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని ఆయన చేసిన అభివృద్ధి పేదవాడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిందని తెలిపారు. లక్షలాది మంది ప్రాణాలు కాపాడిన ఆరోగ్యశ్రీ పథకం సృష్టికర్త డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వైయస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైయస్సార్ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.

# పేదల పెన్నిధి వైయస్సార్

* ముంచంగిపుట్టులో ఘనంగా వైఎస్ఆర్ 77వ జయంతి వేడుకలు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 08.** పేదల పెన్నిధి దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని వైసీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు అన్నారు. బుధవారం ముంచంగిపుట్టు మండల కేంద్రంలో వైసీపీ శ్రేణులు వైయస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో గల నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి మొదటగా వైసిపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి పేద ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడిగా ఆయనని మనం స్మరించుకోవడం గర్వకారణంగా పేర్కొన్నారు. వైయస్సార్ అంటేనే ఒక భరోసా అని, మాట ఇస్తే మడమ తిప్పని నిజాయితీగల నాయకుడు అని, ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడి ఇంటికి నేరుగా చేరాయని అన్నారు. ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రియంబర్స్మెంట్, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ గృహాలు, అనేక సంక్షేమ పథకాలు అమలు పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప నాయకుడు అన్నారు. ఆయన మన మధ్య భౌతికంగా లేకపోయినా ఆయన చేసిన మంచి పనుల ద్వారా ప్రతి పేదవాడి గుండెల్లో ఎప్పటికీ జీవించి ఉంటారని ఆయన ఆశయాలు సిద్ధాంతాలు సాధించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని వైసిపి నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా జెసిఎస్ కోఆర్డినేటర్ జగబంధు, వైస్ ఎంపీపీ భాగ్యవతి, అరకు నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షుడు కొండలరావు, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, కమల, గణపతి, మాజీ సర్పంచులు రమేష్ బాబురావు నీలకంఠం గంగాధరం, పార్టీ నాయకులు మత్స్యలింగం, పాపారావు, సుభాష్ చంద్ర,సన్యాసిరావు, దాసు, భాస్కర్, బాబురావు, భగత్రం సింహాచలం రాంప్రసాద్ లతోపాటు పార్టీ అభిమానులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 13 వ వార్డు లో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహావిష్కరణ

మహనీయునికి ఘన నివాళి అర్పించిన నాయకులు



**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూలై 8:**నియోజకవర్గం 13 వ వార్డు రామకృష్ణపురం లోస్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహ ప్రారంభోత్సవ వేడుకకు ముఖ్య అతిథిలుగా ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యురాలు వరుదు కళ్యాణి. విశాఖ జిల్లా అధ్యక్షులు కె కె రాజు,రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు జి.వి రవిరెడ్డి,తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు.గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి తూర్పు నియోజకవర్గ పరిశీలకురాలు పెడాడ రమణికుమారి.మాజీబ్ మేయర్ గొలగాని హరి వెంకట్ కుమారి.ముఖ్య అతిథులుగా పాల్గొని వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయనివిధంగా,వినూత్నమైన ప్రజాసంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి,ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు.ఆయన ప్రవేశపెట్టినఆరోగ్యశ్రీ,108,104,ఉచిత విద్యుత్,జల యజ్ఞం,ఫీజు రియంబర్స్మెంట్ పథకాలు దేశవ్యాప్తంగా పేరెన్నికగన్నాయన్నారు.ఈయొక్క కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సేవా కార్యక్రమాలను వారు ప్రారంభించారు.

# ఘనంగాడాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు





**ప్రజా సంక్షేమానికి వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయం**

**గంగవరం, పెన్ పవర్, జూలై 8:**దివంగత ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక నాయకుడు డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా గంగవరం మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆయన సేవలను స్మరించుకుంటూ మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ఉచిత విద్యుత్, జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పేదలకు ఆరోగ్య సేవలు అందించేందుకు ఆరోగ్యశ్రీ, విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్, పేదలకు గృహాలు, మహిళా సంక్షేమ కార్యక్రమాలు వంటి అనేక సంక్షేమ పథకాలతో కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన మహానేతగా ఆయనను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని కొనియాడారు. పేద ప్రజల పట్ల ఆయనకు ఉన్న అంకితభావం, ప్రజా సమస్యల పరిష్కారానికి చేసిన పాదయాత్ర, ప్రజలతో మమేకమైన నాయకత్వం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, విలువలను ప్రతి కార్యకర్త ముందుకు తీసుకెళ్లాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ శ్రేణులు చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఆయన ప్రజా సంక్షేమ భావజాలాన్ని ప్రతి ఇంటికీ చేరవేసేందుకు కృషి చేస్తామని, ప్రజలకు అండగా నిలవడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం కార్యకర్తలు "డాక్టర్ వైఎస్సార్ అమర్ రహే" అంటూ నినాదాలు చేస్తూ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు యజ్జు వెంకటేశ్వరరావు, మండల ఇంచార్జ్ సీహెచ్ రఘునాథ్, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జడ్పీటీసీ ఏ. బేబీ రత్నం, వైస్ ఎంపీపీ గంగాదేవి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్. ఏడుకొండలు, మాజీ సర్పంచ్ నేసం మరిడమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు ఈపీ సతీష్, నాయకులు గోపాల్, జగదీష్, మాజీ ఉపసర్పంచ్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పాలనలో పంచాయతీలు.. మూడు నెలలైనా మారని సమస్యలు



**సీతానగరం, పెన్ పవర్, జూలై 08:**పంచాయతీల్లో సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైనా గ్రామాల్లో సమస్యలు మాత్రం యధాతధంగానే కొనసాగుతున్నాయి. ప్రత్యేకాధిరులు భ్యాధతలు చేపట్టి మూడు నెలలు గడుస్తున్నా కాలువలు రహదారులు పారిశుద్ధ్యం ఫాగింగ్ వంటి ప్రాధమిక సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కో ప్రత్యేకాధికారికి రెండు నుంచి ఐదు గ్రామపంచాయతీల బాధ్యతలు అప్పగించారు. శాఖపరమైన విధులతో పాటు పంచాయతీల నిర్వహణను కూడా వీరే పర్యవేక్షించాల్సి ఉండడంతో గ్రామాలపై సరైన దృష్టి పడడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమలు పెండింగ్ బిల్లులు చెల్లింపులు నిధులు వినియోగం ప్రజల సమస్యలు పరిష్కారం వంటి బాధ్యతలు పెరగడంతో గ్రామస్థాయిలో పాలన స్తబ్దుగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి. మూడేళ్ల క్రితం గ్రామాల్లో దోమల నివారణ కోసం అందజేసిన ఫాగింగ్ యంత్రాలు ఇప్పటికీ కొన్నిచోట్ల వినియోగంలోకి నోచుకోక పోవడంతో దోమల బెడద అధికమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు తున్నారు. అధికారులు వాటిని స్వాధీనం చేసుకుని ఫాగింగ్ నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్న ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధి





- మితమైన ఆహారపు అలవాట్లు, ముందస్తు పరీక్షలతో నియంత్రణ సాధ్యం
- మీడియా సమావేశంలో యశోద హాస్పిటల్స్ ఊపిరితిత్తుల వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ గోపికృష్ణ వెల్లడి

**రాజమహేంద్రవరం, ,పెన్ పవర్, జూలై08;** నేడు యాంత్రికంగా మారిన ఆధునిక జీవన శైలిలో మితమైన ఆహారపు అలవాట్లు, ముందస్తు పరీక్షలతో ప్రమాద కరమైన ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధులను నియంత్రణ సాధ్యమని యశోద హాస్పిటల్ ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధి స్పెషలిస్ట్ డాక్టర్ యడ్లపాటి గోపికృష్ణ అన్నారు. స్థానికంగా బుధవారం జరిగిన మీడియా సమావేశంలో డాక్టర్ గోపికృష్ణ మాట్లాడుతూ, ప్రపంచంలో ప్రస్తుతం అన్ని రకాల క్యాన్సర్ వ్యాధుల్లో ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రమాదకర స్థాయిలో ఉందన్నారు. ప్రపంచంలో ఈ క్యాన్సర్ తో 18 లక్షల మంది రోగులు మృతి చెందతుండగా, దేశంలో 65,000 మంది చనిపోతున్నారన్నారు. ఈ వ్యాధి ఎక్కువగా పొగకు ఉత్పత్తుల సేవించడం, ప్రభలడానికి కట్టెలు, పిడకల పొగ, మోటార్ వాహనాల పొగ, కాలుష్యము, ఆధునిక జంక్ ఫుడ్స్ ఆహారపు అలవాట్లు ప్రధాన కారణమన్నారు. మూడు దశాబ్దాల క్రితం 50- 60 సంవత్సరాల మధ్య క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు బయటకు వచ్చేవారని, నేడు యువత ఈ క్యాన్సర్ వ్యాధి బారిన పడుతుండ డం ఆందోళన ఆందోళన కలిగిస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆధునిక వైద్య పరికరాలు, చికిత్స విధానాలు యశోద హాస్పటల్లో అందుబాటులోకి వచ్చయ న్నారు. నావిగేషనల్ బ్యాంకులో బ్రాంకుయో స్కోపి, టార్గెటెడ్ బయాప్సీ, చికిత్స విధానాలు ముందస్తు పరీక్షలతో, ఆహారపు అలవాట్లు మార్చుకోవడం ద్వారా ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. వంశపారంపరంగా పొగాకు తాగే కుటుంబాల్లో 40% రిస్క్ ఉంటుందని, రెండు వారాలు పైబడి వీడని జ్వరం , బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో సాయికిరణ్ , రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తపస్సుకొండ ప్రాంతంలో విత్తనబంతుల వెదజల్లే కార్యక్రమం...




**అడ్డతీగల ,పెన్ పవర్, జూలై08;**అడ్డతీగల మండలం తపస్సు కొండ ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టి 'హరిత కవచం' లక్ష్యంలో భాగంగా అడ్డతీగలలో విత్తనబంతుల వెదజల్లే కార్యక్రమం నిర్వహించారు. రంపచోడవరం డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ శివకుమార్ గంగాల్ మరియు సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ జే.వి సుబ్బారెడ్డిల ఆదేశాల మేరకు, అడ్డతీగల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అడ్డతీగల డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జి. యోగేంద్ర, అటవీ శాఖ సిబ్బంది, జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు స్థానిక వన సంరక్షణ సమితి సభ్యులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

తపస్సు కొండ సౌత్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో పచ్చదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో, సుమారు 1200 విత్తనబంతులను (మారేడు, నేరేడు, చింత తదితర జాతులకు చెందినవి) అటవీ ప్రాంతంలో వెదజల్లారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, అడవుల్లో సహజ సిద్ధమైన మొక్కలు మొలిచేందుకు వీలుగా అటవీశాఖ ఈ విత్తనబంతుల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, భవిష్యత్ తరాల కోసం పర్యావరణ సమతుల్యతను కాపాడటం ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలి అని, ఇలాంటి కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థులకు పర్యావరణం పట్ల అవగాహన కల్పించడం, వారిని కూడా ఈ మహత్తర కార్యంలో భాగస్వాములను చేయడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని అడ్డతీగల ఫారెస్ట్ రేంజ్ అధికారి పి .శ్రీనివాసరావు తెలిపారు.

# టిడిపి యూనిట్ల సమావేశం



**సీతానగరం, పెన్ పవర్ జూలై 08:**సీతానగరం మండలంలోని టిడిపి యూనిట్ల సమావేశం జరిగింది. బుధవారంనాడు వంగలపూడి గ్రామంలో ఒకటో యూనిట్ ఇన్చార్జ్ మండ రాంబాబు ఆధ్వర్యంలో ఏడు బూత్ లు టిడిపి నేతలు కార్యకర్తలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్ పరిధిలోని అర్హులైన ఓటర్లందరినీ చేర్పించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని కార్యకర్తలు పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడడం ప్రతీ కార్యకర్త బాధ్యత అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చర్చించుకున్నారు. అదేవిధంగా రైతులకు యూరియా అందుబాటులో ఉండేలా చూడాలని సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ఉద్యోగులకు జీతాలు సక్రమంగా అందేలా చూడాలని ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు నాయకులు కార్యకర్తలు పర్యవేక్షించి సమస్యలను పరిష్కారం చేసే విధంగా చేయాలనుకున్నారు. ఈ కార్యక్రమంలో గద్దె వెంకటకృష్ణ చౌదరి (నళిని), గద్దె నాని, షేక్ మీరా షరీఫ్ రాజు, గద్దె శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## వెట్టి చాకిరి నిర్మూలన విజిలెన్స్ కమిటీ సభ్యుడు గంగాధరరావుకు ఎమ్మెల్యే అభినందనలు



**పెన్ పవర్ । ఉంగుటూరు । జులై 08:**వెట్టి చాకిరి నిర్మూలన వ్యవస్థ విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నియమితులైన ఇమ్మణి గంగాధరరావును ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు నియామక పత్రం జిరాక్స్ ప్రతిని అందజేశారు.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గంగాధరరావును విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నియమించిన నేపథ్యంలో, తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు ఆయనకు దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు.

మూడు పర్యాయాలు తెలుగుదేశం పార్టీ మండల కమిటీ అధ్యక్షుడిగా సేవలందించిన సీనియర్ నాయకుడు గంగాధరరావుకు కూటమి ప్రభుత్వంలో సముచిత స్థానం లభించడం పట్ల పలువురు నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## మహానేత వైఎస్సార్‌కు పాలాభిషేకం.. రంపచోడవరంలో ఘనంగా 77వ జయంతి వేడుకలు



**రంపచోడవరం, పెన్ పవర్, జూలై 8:** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. వైకాపా లీగల్ సెల్, యువజన నాయకుడు పండా సిద్ధార్థ దొర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా పండా సిద్ధార్థ దొర, రాష్ట్ర యువజన నాయకుడు గొల్లపల్లి శివబాబు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ఎన్నో చారిత్రాత్మక పథకాలను అమలు చేశారని కొనియాడారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు నాణ్యమైన వైద్య సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్య, రైతులకు రుణమాఫీ, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆయన మరణించి దశాబ్దానికి పైగా గడిచినా ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని అన్నారు.

ఈ కార్యక్రమంలో రంపచోడవరం వైకాపా సీనియర్ నాయకుడు కప్పల వెంకటరావు, నియోజకవర్గ సోషల్ మీడియా సభ్యుడు రాపాక సుధీర్ రాజ్, యువజన నాయకులు డా. హేము, ఇర్ప శ్రీను, వినోద్, కోసు శ్రీను, కారం శేఖర్ బాబు, దివాకర్‌తో పాటు పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.ఎ

## వైద్య కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 8**:వైద్య విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే స్పందించిన సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ రాజమండ్రి ప్రభుత్వ వైద్య కళాశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సంబంధిత అధికారులు, నిర్మాణాలు, నిర్వహణ పనులు చేపడుతున్న మెగా కంపెనీ ప్రతినిధులతో సమావేశమై జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. జాప్యం లేకుండా పనులను వేగవంతం చేయాలని మెగా కంపెనీ ప్రతినిధులను ఎమ్మెల్యే వాసు ఆదేశించారు. కొత్త భవనానికి అప్రోచ్ రోడ్డు, ప్రవేశ మార్గాలు, లెక్చర్ గ్యాలరీలు, ఎలక్ట్రికల్ పనులు, పైపింగ్, ఆడియో–వీడియో టెస్టింగ్ వంటి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కొత్తగా అడ్మిషన్లు పొందే విద్యార్థులకు తరగతుల నిర్వహణలో అంతరాయం కలగకుండా ఉన్న బ్లాకులను తాత్కాలికంగా వినియోగించుకోవా లన్నారు. నిర్మాణ ప్రాంతాల్లో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జూలై 25 నాటికి కొత్త లెక్చర్ గ్యాలరీలను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పరీక్షల నిర్వహణపై సమీక్షించిన ఎమ్మెల్యే వాసు ఆగస్టు 15 నాటికి పరీక్షా హాళ్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు. జనరేటర్, ఇంటర్నెట్, సీసీ కెమెరాలు, పవర్ బ్యాకప్, ప్రింటింగ్ వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. . కొత్త హాస్టల్ భవనాల్లో రెండు అంతస్తులను ఆగస్టు నాటికి సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలురు, బాలికల హాస్టళ్లకు అవసరమైన ఓవర్‌హెడ్ ట్యాంకులు, మౌలిక వసతుల పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల పురోగతిని తాను నిరంతరం పర్యవేక్షిస్తానని, మళ్లీ తనిఖీ నిర్వహిస్తానని తెలిపారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com